విశాఖపట్టణం
మంగళవారం 28 జులై 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:185 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

ప్రతి పౌరుడికి శాంతియుత నిరసనలు

# తెలిపే హక్కు ఉంది

ఇది ప్రజాస్వామ్యంలో

రాజ్యాంగ్ ఇచ్చిన భరోసా

చీఫ్ జస్టిస్

అభిప్రాయం



2



## ఎల్ నినోపై రైతులకు అవగాహన

ప్రత్యామ్మాయ పంటలు ప్రొత్సహించాలి

పంటల భీమా యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలి

సీఎం చంద్రబాబు ఆదేశాలు

(అమరావతి - జయజయహే)

ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్‌నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు, రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రొత్సహించాలని సూచించారు. ఏ ప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనే దానిపై రైతులకు వివరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల ..మిగతా 2లో

# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు


భోగాపురం ఎయిర్ పోర్టు గ్రోత్ ఇంజిన్

నిర్దిష్ట గడువులోగా ఏర్పాట్లు పూర్తి కావాలి

సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు

అల్లూరి ఎయిర్ పోర్టుపై అధికారులతో కీలక సమీక్ష





(అమరావతి - జయజయహే)

భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చినట్లు అవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంపై ఏపీ సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయం ప్రారంభం అవుతుందని తెలిపారు. 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,727 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు వివరించారు. ఈ విమానాశ్రయంలో 3,800 మీటర్ల రన్‌వే ఉందని గుర్తు చేశారు. తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం ఈ విమానాశ్రయం కలిగి ఉందన్నారు. 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే భద్రత, ట్రాఫిక్, అతిథుల స్వాగత ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

# బాబుపై బొండా రివర్స్

అది వైసీపీ సభ కాదు... ముద్రగడ సంతాప సభ

అందుకే అక్కడికే వెళ్లా

వంగవీటి రాథా, జ్యోతుల నెహ్రూను వివరణ అడగగలరా?

విచారణకు త్రిసభ్య కమిటీ వేసిన బాబు

(అమరావతి - జయజయహే)

కాపు నేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలను రాష్ట్రమంతటా జరుగుతున్నారు ఆ సామాజిక వర్గ నేతలు. పార్టీలకతీతంగా జరుగుతున్న ఈ సభల్లో కాపు నేతలు చాలామంది పాల్గొంటున్నారు. అందులో భాగంగా ఇటీవల గుంటూరులో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమ పాల్గొన్నారు. అయితే అదే సభకు వైసిపి మాజీమంత్రి అంబటి రాంబాబు సహా ఇతర కీలక నేతలు హాజరయ్యారు. అలాంటి వారితో బొండా ఉమా కలిసి ఒకే సభలో పాల్గొనడం పొలిటికల్‌గా చర్చను తెర తీసింది. ఆ సమయంలోనే బొండా ఉమా సంచలన వ్యాఖ్యలు చేశారు. "కాపు సామాజిక వర్గ డిమాండ్లను తెలుగుదేశం గతంలో సరిగా పట్టించుకోలేదని , దానివల్ల 2019 ఎన్నికల్లో టిడిపి ఓడిపోయిందని "ఆయన అన్నారు. "ముద్రగడ పద్మనాభం చేసిన ఉద్యమం వల్లే 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవాల్సి వచ్చిందని, రాష్ట్రంలో 25 శాతం జనాభా ఉన్న కాపులకు జనాభా దామాషా ప్రకారం నిధులు, పదవులు ..మిగతా 2లో



# కిలో బియ్యం రూ. 52కే

రైతు బజార్లలో విక్రయాలు

ఆగస్టు 1 నుంచి అందుబాటులోకి

పౌరసరఫరాల శాఖ నిర్ణయం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం

(అమరావతి - జయజయహే)



కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యుడికి సాంత్వన చేకూర్చేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52లకు, గ్రేడ్ 1 రా రైస్ రూ.50లకు రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు ..మిగతా 2లో



## ఆకివీడులో రామాలయ నిర్మాణానికి ఓకే

చట్టపరమైన ఎటువంటి అడ్డంకి లేదు

కలెక్టర్ ఆదేశాలు సబబే.. అసత్యాలు లేవు

సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేటలో రామలయం నిర్మాణానికి సంబంధించి జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీ) సుప్రీంకోర్టు సమర్థించింది. ప్రభుత్వ భూమిలో ఆలయ నిర్మాణాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే ఈ ప్రాజెక్టుపై ఏవైనా సరైన అభ్యంతరాలు ఉంటే, కొత్తగా పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని కోర్టు పేర్కొంది. ఆ ప్రదేశంలో 80 ఏళ్లకు పైగా రామ మందిరం ఉన్నట్లు రికార్డులు సూచిస్తున్నాయని, ఆకివీడులో ..మిగతా 2లో

# చిక్కుల్లో తమ్మినేని కుమారుడు

ముందస్తు బెయిల్ నిరాకరించిన హైకోర్టు

సీతారాం, ఆయన భార్యకు బెయిల్ మంజూరు

భూ కబ్జా, ఫోర్జరీ డాక్యుమెంట్స్ కేసులో కీలక పరిణామం



(అమరావతి - జయజయహే)

వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు, అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో మిశ్రమ ఫలితం ఎదురైంది. తీవ్రమైన భూకబ్జా , ఫోర్జరీ పత్రాల కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ తమ్మినేని కుటుంబ సభ్యులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు సోమవారం కీలక ఉత్తర్వులు వెలువరించింది. తమ్మినేని సీతారాం కుమారుడు తమ్మినేని వెంకట చిరంజీవి నాగుకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానం స్పష్టంగా నిరాకరిస్తూ ఆయన పిటిషన్‌ను కొట్టివేయగా, ఇదే కేసులో నిందితురాలిగా ఉన్న సీతారాం, ఆయన సతీమణి తమ్మినేని వాణికి మాత్రం హైకోర్టు మధ్యంతర ఉపశమనం కల్పించింది. శ్రీకాకుళం శివారులో ఓ ఖరీదైన స్థల యజమాని బతికి ఉన్నా చనిపోయినట్లుగా డెత్ సర్టిఫికెట్ పుట్టించి.. అసలు ఆయనకు సంబంధం లేని మరో మహిళను వారసురాలిగా చూపించి ఫోర్జరీ పత్రాలు, నకిలీ దస్త్రాల ద్వారా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారనే ..మిగతా 2లో

## రెండు వారాల్లో స్టేటస్ రిపోర్టు ఇవ్వాలి

అయోధ్య విరాళాల చోరీపై సిట్‌కు సుప్రీం ఆదేశాలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణల సంబంధిత కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. కేసు దర్యాప్తు పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను తప్పనిసరిగా చేర్చాలని ఉత్తర్వులిచ్చింది. అలాగే దర్యాప్తు పురోగతిపై కూడా రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశిస్తూ డెడ్‌లైన్ విధించింది న్యాయస్థానం. ఈ కేసు విచారణ కోసం ఐజీ కిరణ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు విచారణ ..మిగతా 2లో

For a pure tomorrow..

# బాబుపై బొండా రివర్స్

మొదటి పేజీ తరువాయి...

దక్కాలని" బొండా ఉమా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా హీట్ పుట్టిస్తున్నాయి. టిడిపి అనుబంధం సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో బొండా ఉమాకు వ్యతిరేకంగా పోస్టులు కనబడుతున్నాయి. అదే సమయంలో కాపు సామాజిక వర్గ నేతలు బొండా ఉమా అన్న మాటలను సపోర్ట్ చేస్తున్నారు. దానితో ఏపీలో రాజకీయంగా ఈ మొత్తం ఇష్యూ పెద్ద సంచలనమే సృష్టించింది.

**వివరణ ఇచ్చిన బొండా ఉమా**

అధిష్టానం నిర్ణయాలను వ్యతిరేకించేలా మాట్లాడిన బొండా ఉమాను సస్పెండ్ చేయాలంటూ కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో కనపడటంతో బొండా ఉమ దీనిపై వివరణ ఇచ్చారు. అధిష్టానానికి తన వివరణ ఇచ్చేందుకు సిద్ధమే అని అయితే అయితే ఇలాంటి సభల్లోనే పాల్గొన్న వంగవీటి రాధా, జ్యోతుల నెహ్రూ లాంటి వాళ్లను కూడా వివరణ అడుగుతారా



అంటూ ఆయన ప్రశ్నించారు. తాను పాల్గొంది వైసిపి సభ కాదని కేవలం ముద్రగడ సంస్మరణ సభ మాత్రమే అని బొండా ఉమామహేశ్వరరావు తన సన్నిహితుల వద్ద అన్నారు.

**త్రి సభ్య కమిటీ వేసిన చంద్రబాబు**

ఈ మొత్తం వ్యవహారం అటు ఇటు తిరిగి చంద్రబాబుకే చుట్టుకునేలా కనపడడంపై సీరియస్ అయిన అధిష్టానం పల్లా శ్రీనివాసరావు, నిమ్మల రామానాయుడు, కిలారు రాజేష్‌తో ఒక త్రిసభ్య కమిటీని నియమించింది. బొండా ఉమా ఈ కమిటీ ముందు హాజరై తన వివరణ ఇవ్వాలని తెలిపింది అధిష్టానం. ఈ అంశం మొత్తం ఇప్పుడు ఎంత సున్నితంగా బొండా ఉమా పై యాక్షన్ తీసుకుంటే ఆ సభకు హాజరైన మిగిలిన టిడిపి నేతలపైనా యాక్షన్ తీసుకోవాల్సి వస్తుంది. పైగా కాపు సామాజిక వర్గానికి టిడిపి వ్యతిరేకమా అనే అభిప్రాయం జనాల్లోకి తీసుకెళ్లే ప్రమాదం ఉంటుంది. అలా కాదని ఏ చర్య తీసుకోకపోతే అధిష్టానం నిర్ణయాన్ని తప్పు పట్టినా పార్టీ నేతలపై చర్యలు ఉండవా అంటూ మరో వర్గం జనాలకు వెళ్లే అవకాశం ఉంటుంది. దానితో ఈ మొత్తం ఎపిసోడ్లో బొండా ఉమా తాను ఇరుక్కున్నారా ? లేక అధిష్టానాన్ని ఇరికించేసారా అనే చర్చ ఏపీ రాజకీయాల్లో మొదలైంది.

## ఆకివీడులో రామాలయ నిర్మాణానికి ఓకే

మొదటి పేజీ తరువాయి...

రామలయం నిర్మాణానికి ఎలాంటి చట్టపరమైన అడ్డంకి లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ వివాదానికి సంబంధించి.. గతంలో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిరభ్యంతర పత్రం చట్టబద్ధమైనదేనని సుప్రీం కోర్టు పేర్కొంది. ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు లోబడి ఆలయ నిర్మాణం చేపట్టడంలో ఎలాంటి తప్పులేదని వెల్లడించింది. ఆలయ నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌లో ఎటువంటి సత్యాలు లేవని కోర్టు పేర్కొంది. పిటిషన్‌ను తోసిపుచ్చింది. కలెక్టర్ ఇచ్చిన ఎన్‌ఓసీ సరైనదేనని, దానిలో ఎలాంటి చట్ట ఉల్లంఘన జరగలేదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలో రామాలయాన్ని నిర్మించడంలో ఎలాంటి అభ్యంతరం లేదని కోర్టు వెల్లడించింది. సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆకివీడులో రామాలయ నిర్మాణానికి మార్గం సుగమమైంది. న్యాయస్థానం తీర్పుతో స్థానిక ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు సుప్రీం కోర్టు తీర్పుపై సంతోషం వ్యక్తం చేశారు. 'ఆకివీడులో రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్! రామాలయ నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది! సత్యం గెలిచింది! ధర్మం గెలిచింది! శ్రీ రాముడు గెలిచాడు!! జై శ్రీ రామ్!' అని రఘురామ కృష్ణ రాజు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## రెండు వారాల్లో స్టేటస్ రిపోర్టు ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి...

వేగంగా, నిష్పాక్షికంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఆలయానికి వచ్చిన విరాళాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. అయితే.. ప్రస్తుతం తాము దర్యాప్తును పూర్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు వివరాలను వెలువరించడంపై ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. సిట్ సమర్పించే నివేదికను పరిశీలించాకే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. దీంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది

## కిలో బియ్యం రూ. 52కే

మొదటి పేజీ తరువాయి...

చేశారని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. సామాన్యుడిపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా చొరవ తీసుకోవడం స్వాగతించదగినదని చెప్పారు. 'బహిరంగ మార్కెట్ ధరలను సమీక్ష చేసి, మిల్లర్లతో అత్యవసరంగా సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండేలా మేలైన ధరలను నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థికభారాన్ని తగ్గిస్తుంది.' అని పవన్ కళ్యాణ్ విశ్వాసం వ్యక్తంచేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో భవిష్యత్తులో చేపట్టనున్న సంస్కరణలు, కార్యాచరణకు కేంద్ర సహకారం కోరుతూ ఢిల్లీలో రెండు రోజుల పర్యటనకు వెళ్లారు మంత్రి నాదెండ్ల మనోహర్. ఇందులో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అనీస్ జోసెఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దేందుకు చేపట్టనున్న సంస్కరణలు, పరస్పర సహకారం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

## ప్రతి పౌరుడికి శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

జయ జయహే

నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాం గం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.




## అలరించిన హన్సిక నాట్య విలాసం

విశాఖపట్నం, జూలై 27, జయ జయహే :

నాట్య కళా క్షేత్ర మ్యూజిక్ అండ్ డాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్య సభలో వి.హన్సిక ప్రదర్శించిన నృత్య రీతులు అందర్నీ అలరించాయి. తన భరతనాట్య ప్రదర్శన విఘ్నేశ్వర శ్లోకం తో ప్రారంభమై పుష్పాంజలి, అలరిపు, దేవి స్తుతి, అన్నమాచార్య కీర్తన, శివ స్తుతి, దశావతార కృతి, చివరిగా తిల్లానాతో ముగిసి ఆద్యంతం వీక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. ఈ సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన ప్రఖ్యాత నాట్య గురువు విజయశ్రీ ఆర్ట్స్ అకాడమీ ప్రిన్సిపాల్ డా. కె. వి. విజయవేణి, వి డెంటల్, హెల్త్ కేర్ డైరెక్టర్ డా. కె.ఎం.కె రమేష్ , రైల్వే మెయిల్ సర్వీస్ సూపరింటెండెంట్ పి. కోమల్ కుమార్, ప్రఖ్యాత డ్రాయింగ్ టీచర్ టి. గోవిందు పాల్గొని నాట్య విద్యార్థిని వి.హన్సికను అభినందించారు. నాట్యంలో ఆమె చూపిప చక్కని అభినయం, ఆహార్యం, వ్యాఖ్యానంతో ప్రదర్శించిన ప్రతిభను కొనియాడారు. ఈ నాట్య సభలో నృత్య విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనకు గాత్రం భరత నాట్య గురువు కె. వెంకట్ చిన్నా రావు, మృదంగం టి. చైతన్య, వయొలిన్ ఎ. సత్య విశాల్, నట్టువాంగం ఆర్.ఆర్. నిపుణ (విద్యార్థి) తమ సహకారం హృద్యంగా అందించారు.




## యాక్మి ఆధ్వర్యంలో అదరగొట్టిన భారతీయం

విశాఖపట్నం, జూలై 27, జయ జయహే

యాక్మి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్ పురస్కరించుకుని భారతీయం పేరిట సుమారు 250 వివిధ కళాశాలకు చెందిన బాలబాలికలతో జాతీయ సమైక్యత కార్యక్రమం మూడు గంటలపాటు ఇటీవల చిల్డ్రన్ ఎరేనా లో నిర్వహించారు. ఈ విషయాన్ని నిర్వహకులు సోమవారం వెల్లడించారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి రమణమూర్తి, జిల్లా సైనిక అధికారి వింగ్ కమాండర్ పీల చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ నేవెల్ కమాండ్ బ్యాండ్ వారి ఆధ్వర్యంలో 40 మ్యూజిషన్స్‌తో భారీ సంగీత కచేరి సుమారు అరగంట పాటు నిర్వహించారు. అనంతరం సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఫర్ వుమెన్, స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్, నృత్య భారతి, కళారాధన మ్యూజికల్ డాన్స్ అకాడమీ సన్ఫ్లవర్ స్కూల్, స్టీల్ ప్లాంట్ బెంగాలీ అసోసియేషన్ తదితరు స్కూల్ నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో దేశానికి సేవ చేసే మాజీ సైనికులు డాక్టర్ చంద్రశేఖర్‌ని, వీర నారీలు రేనా సింగ్, కొల్లి భవాని లక్ష్మిని యాక్మి సత్కరించారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి రమణమూర్తి, లెఫ్టినెంట్ లోకేష్, పోలమరిశెట్టి శర్వాణి, ఆప్ సబ్ కి అవాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం , భావిశెట్టి కిరణ్ కుమార్, ఆడారి కిషోర్ కుమార్, నిర్మాత పివిన్ తిలక్, యాక్మి ప్రతినిధులు పి ఆనంద్ కుమార్, పర్వీష్, కౌశిక్, భీమరశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతాప్ కుమార్ అధ్యకాత వహించుగా లావణ్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు.




## ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

**ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**

విశాఖపట్నం, జూలై 27, జయ జయహే

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేందుకు చేపడుతున్న ఏర్పాట్లలో భాగంగా జన సమీకరణపై జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆగస్టు 1వ తేదీన ఉదయం 5:30 గంటలకు ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బస్సుల్లో బయలుదేరాలని సూచించారు. ప్రయాణానికి సంబంధించిన పూర్తి వివరాలను నాయకులు, కార్యకర్తలకు వివరించారు. అదేవిధంగా ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ రాకతో విశాఖ నగరంలో పరిసర ప్రాంతాలలో అనేది కంపెనీలు రావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రపంచంలో అనేక నగరాలకు దీటుగా అవకాశాలు పెంపొందుతాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పట్టాభి, టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్ నినోపై రైతులకు అవగాహన

మొదటి పేజీ తరువాయి...

విషయంలో కొంత గ్యాప్ ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన రంపచోడవరం విద్యార్థి శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## చిక్కుల్లో తమ్మినేని కుమారుడు

మొదటి పేజీ తరువాయి...

ఆరోపణలపై తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణి, కుమారుడు నాగులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అధికారంలో ఉన్న సమయంలో సర్కారీ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ కోట్ల రూపాయల విలువైన ఆస్తుల అక్రమ బదిలీకి పాల్పడ్డారని బాధితులు, దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. అరెస్టు నుంచి రక్షణ పొందడం కోసం వారు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. తమ్మినేని నాగుపై నమోదైన ఆరోపణలు తీవ్రమైనవని, ఫోర్జరీ వ్యవహారాల్లో ఆయన పాత్రపై సమగ్ర దర్యాప్తు అవసరమని అభిప్రాయపడింది. ఈ క్రమంలో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే విచారణపై ప్రభావం పడుతుందనే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటూ నాగు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో నాగుకు ఎప్పుడైనా అరెస్టు చేసే అవకాశం ఉంది. అదే సమయంలో, తమ్మినేని సీతారాం, ఆయన సతీమణి తమ్మినేని వాణి విషయంలో న్యాయస్థానం కొంత సానుకూలంగా స్పందించింది. మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. అయితే కొన్ని కఠినమైన షరతులను విధించింది. పోలీసుల విచారణకు పూర్తిగా సహకరించాలని, దర్యాప్తు అధికారులు ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరుకావాలని వాణిని ఆదేశించింది. ఎట్టిపరిస్థితుల్లోనూ సాక్షులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించకూడదని హెచ్చరించింది. గత కొద్దిరోజులుగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబం అజ్ఞాతంలో ఉన్నారు. కుమారుడికి బెయిల్ లభించకపోవడంతో తమ్మినేని, ఆయన భార్య అజ్ఞాతం నుంచి బయటకు వచ్చే అవకాశం ఉంది. ఈ తీర్పుపై తమ్మినేని సీతారాం న్యాయ బృందం సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

## గిరి ప్రదక్షిణ భక్తుల వైద్య శిబిరం ఏర్పాట్లు పూర్తి

**రోటరీ క్లబ్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ దేవరకొండ**

విశాఖపట్నం, జూలై 27, జయ జయహే :



సింహాచల గిరిప్రదక్షిణ లో పాల్గొనే వేలాది మంది భక్తులకు వివిధ వైద్య సేవలు అందించేందుకు రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాట్లు పూర్తి అయ్యాయని రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ కమ్యూనిటీ సర్వీసెస్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ దేవరకొండ పేర్కొన్నారు. సుమారు 30 మందితో మూడు వైద్య బృందాలుగా 28న సాయంత్రం 4 గంటల నుంచి 12 గంటల పాటు నిర్విరామంగా వైద్య సేవలను అందించనున్నారు. ముఖ్యంగా కాళ్ల నొప్పులు, వాపులు నివారించేందుకు ఔషధ స్ప్రేలను, ఐస్ ప్యాక్లను ఉచితంగా అందజేస్తారు. అస్వస్థతకు గురైన వారికి ప్రథమ చికిత్స తో పాటు అత్యవసర సమయంలో మెరుగైన వైద్య సహాయం కోసం ఆసుపత్రి తరలించేందుకు అంబులెన్స్ సదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సేవలందించేందుకు వి హెల్త్ కేర్ వైద్య బృందం, ఫిజియోథెరపిస్టులు డాక్టర్ పర్వీన్, డాక్టర్ రమేష్, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ వైద్య బృందం, డి.డి.ఆర్. ఇన్స్టిట్యూషన్స్ నర్సింగ్ విద్యార్థులు, ఎరుమేలి అయ్యప్ప అన్న సమారాధన ట్రస్ట్ వంటి పలు సంస్థలు సహకారాన్ని అందిస్తున్నాయని డాక్టర్ అశోక్ తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో ఆసక్తి కలిగిన వారు పాల్గొని తగిన సహాయం అందించవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పాడేరు వైద్య ఆరోగ్య శాఖలో భూతాలు...!

**- దెయ్యాన్ని వదలగొట్టిన ప్రభుత్వం... - ఆ భూతాల పని పట్టే బాధ్యత జెడంఎంకి అప్పగింత**

**- అవినీతి భూతాలతో నలిగిపోతున్న గిరిజనం**

(ఎం. కే. సునీల్ కుమార్ - జయ జయహే బ్యూరో )

మన్యం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన పాడేరు వైద్య ఆరోగ్య శాఖకు భూత పిశాచాల అవినీతి పీడ పట్టుకుంది. ప్రతీ పనికీ లంచం ఇస్తేనే గానీ పని చేయని ఆ శాఖ ఉద్యోగులపై ఫిర్యాదులు ఎక్కుపెట్టినా వారిలో చలనం లేకపోవడం చూస్తుంటే అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. కరడుగట్టిన ఉగ్రవాదులు కన్నా దారుణంగా వీరు చేస్తున్న కుట్రలు..కుతంత్రాలు వింటుంటే....వామ్మో



వీళ్లు ఇంత ఘోరమా...అన్న అభిప్రాయం కలగకమానదు. ఒకటి కాదు...రెండు కాదు....వందల్లోనే వీరు చేసిన అవినీతి చిట్టాలు చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నోరెళ్లబెడుతోందంటే పరిస్థితి ఊహించుకోవచ్చు. ఆ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లీలలపై జెడ్పీ సమావేశాల్లో జెడ్పీ సభ్యులు ఏకరువు పెడుతుంటే....జెడ్పీ ఛైర్మన్ సుభద్ర సైతం అసహ్యించుకుంటుంటే....ఏ మాత్రం చలనం లేకుండా ఆ శాఖ ఉద్యోగులు నివురుగప్పిన నిప్పులా అధికారుల వంక చూడడం ఇప్పటికీ అందరికీ గుర్తుండే ఉంటుంది. పాడేరు వైద్య ఆరోగ్య శాఖ పీకల్లోతు అవినీతి ఊబిలో కూరుకుపోయిందన్న సంగతి ప్రభుత్వానికి ఆలస్యంగా తెలిసింది. దాదాపు ఏడాదిన్నరగా అవినీతి చిట్టా ప్రభుత్వానికి నివేదిస్తుంటే....ఎట్టకేలకు గత వారంలో డీఎం అండ్ హెచఓ డాక్టర్ కృష్ణ మర్తి నాయక్‌ను సస్పెన్షన్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అదే కార్యాలయంలో మరో మడు భూతాలు తిష్ట వేశాయి. వైద్య ఉద్యోగులను పీల్చి పిప్పి చేసే ఈ మడు భూతాలు ఈ కార్యాలయానికి ఎవరు ఆదేశాలతో వచ్చారో అన్న సంగతి ఎవరికీ తెలీదు. అసలు వారికి డీఎం అండ్ హెచఓ కార్యాలయంలో ఉద్యోగం చేయాలని ఎవరు ఉత్తర్వులు ఇచ్చారో అంతు చిక్కడం




లేదు. కానీ గత కొన్నేళ్లుగా మాత్రం ఆ ముగురూ అక్కడ ఆడిందే ఆట...పాడిందే పాటగా సాగుతోంది. వారిలో ఇద్దరు మాత్రం జిల్లా లెప్రసీ అండ్ ఎయిడ్స్ కంట్రోల్ విభాగానికి చెందిన వారు కాగా...ఒక్కరే జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన సీనియర్ అసిస్టెంట్‌గా చెప్పుకుంటున్నారు. ఈ ముగ్గురు భూతాలు కలసి ఆ జిల్లా వైద్య శాఖను వాటాలేసుకుని నెల నెలా మామళ్లతో పాటు వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ఫర్నిచర్‌ను సైతం దోచుకున్నారంటే ఎంతటి ఘనాపాఠీలో వేరేగా చెప్పాల్సిన పనిలేదని ఆ శాఖలోనే గుస గుసలు వినిపిస్తున్నాయి. అయితే వీరి అవినీతి చిట్టాపై ప్రభుత్వం సీరియస్‌గానే స్పందించింది. గుట్టుగా విచారణ చేపట్టి ఫిర్యాదులన్నీ వాస్తవమేనని నిర్ధారించుకున్నాకే డీఎం అండ్ హెచఓపై వేటేశారు. ఇప్పుడు ఆ కార్యాలయాన్ని అంటిపెట్టుకున్న మరో మడు భూతాలను సాగనంపేందుకు జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ప్రభావతిని విచారణ అధికారిగా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు నియమించారు. విచారణలో ఎలాంటి అక్రమాలు వెలుగుచూస్తాయోనని అల్లూరి జిల్లాలోనే కాకుండా ఉత్తరాంధ్రలోని అన్ని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాల్లోనూ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. డీఎం అండ్ హెచఓ సీసీ అంటూ ఉద్యోగులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన హెల్త్ సూపర్‌వైజర్ నిజ స్వరూపం బయట పెట్టేందుకు కొందరు...సీనియర్ అసిస్టెంట్‌లు కిరణ్ కుమార్, శ్రీనివాస్‌ల మాయాజాలం ఎలా ఉంటుందో చూపేందుకు మరి కొందరు సిద్దంగా ఉన్నట్టు చెబుతున్నారు. విచారణకు హాజరై ఈ భూతాల భాగోతం బయట పెట్టాలని గిరిజన నేతలు ఆలోచిస్తున్నారన్నది సమాచారం.

# పాల్మన్‌పేటలో హోం మంత్రి అనిత పర్యటన

**పేట నియోజకవర్గం అభివృద్దే లక్ష్యం**

**హోం మంత్రి వంగలపూడి అనిత**

పాయకరావుపేట, జులై 27:-(జయ జయహే)

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట మండలం పాల్మన్‌పేటలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హోం మంత్రికి ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతిస్తూ ఆత్మీయంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో భాగంగా హోం మంత్రి అనిత ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ





సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొత్త పరిశ్రమలను తీసుకొస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్రను అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గాన్ని పరిశ్రమలు, పర్యాటక రంగాలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చేపట్టే ప్రతి ముఖ్య కార్యక్రమాన్ని పాల్మన్‌పేట గ్రామం నుంచే ప్రారంభించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో పాల్మన్‌పేట పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని, పాయకరావుపేట సమగ్ర అభివృద్దే తమ లక్ష్యమని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

# రేపు సి.ఈ.డి.యం నూతన కార్యాలయం ప్రారంభం

**మైనారిటీ యువత సాధికారతే లక్ష్యం**

**మైనారిటీ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్**

అమరావతి, జులై 27 (జయ జయహే



సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ ఏపీ నూతన కార్యాలయ ప్రాంగణం ను మంగళగిరిలోని వడ్డేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్నది. సి ఈ డి యం నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై బుధవారం(29వ తేది) ప్రారంభిస్తారు. రాష్ట్రం లోని మైనారిటీ యువత ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి ఆకాంక్షలను విజయాలుగా మార్చడమే లక్ష్యంగా సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ ఏపీ సేవలు అందించడం జరుగుతుందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిఈడియం ప్రధాన కార్యాలయాన్ని అన్ని రకాల మౌళిక సదుపాయాలతో తీర్చిదిద్దామని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1994లో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ప్రారంభమైన సిఈడియం- ఏపీ అంచలంచెలుగా ఎదిగి మైనారిటీల యువత అభివృద్ధిలో ముఖ్యమైన భాగస్వామ్య భూమిక పోషిస్తున్నదని అన్నారు. ప్రస్తుతం స్మార్ట్ తరగతులు, డిజిటల్ లైబ్రరీ, స్టూడియో సౌలభ్యాలు, సిఈడియం యాప్ తో ఆధునిక సంస్థగా రూపాంతరం చెందిందన్నారు. యు పీ ఎస్ సి,ఏ పీ పీ ఎస్ సి,డి ఎస్ సి , నీట్ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తూ మైనారిటీ యువత విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో మార్గదర్శిగా సి ఈ డి యం మారిందని మంత్రిఫరూక్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం ఇటీవల అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డి ఎస్ సి లో 152 మంది,ఏ పీ పీ ఎస్ సి , పోలీస్ , టెట్ లలో అనేకమంది విజయం సాధించారన్నారు. 2025- 2026 ఎస్ ఎస్ సి ఉర్దూ మీడియం లో 87 శాతం ఉత్తీర్ణత ఫలితాలు వచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం విప్లవాత్మకమైన ప్రణాళికతతో ముందుకు సాగుతున్నదని మైనారిటీ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.



# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" 6 రోజుల ప్రచార కార్యక్రమం

**పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**

విశాఖపట్నం, జూలై 27, జయ జయహే :

విజయనగరం జిల్లా భోగాపురంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ను భారత ప్రధాని ప్రారంభించ నున్న చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" అనే ప్రత్యేక ఇతివృత్తంతో 6 రోజుల పాటు విస్తృత స్థాయి ప్రజా సంప్రదింపుల ప్రచారాన్ని చేపట్టినట్లు తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రగతికి ప్రతీకగా నిలువ నున్నందున ఈ ఆరు రోజుల ప్రచార కార్యక్రమం ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలవడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడులకు, స్థిరమైన అభివృద్ధికి కేంద్రంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో సోమవారం కలెక్టర్ ప్రచార కార్యక్రమాల పై,ప్రజలను కార్యక్రమానికి తీసుకువెళ్లడం , బస్సులు, ఆహారం ,త్రాగునీరు ఏర్పాటు తదితర అంశాలపైన అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ ప్రచార కార్యక్రమాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయడానికి ఇతర జిల్లాల సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు బాధ్యతలను అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. విమానాశ్రయం ద్వారా ఆర్థిక వృద్ధి, పర్యాటకం, ఉపాధి కల్పన మరియు పారిశ్రామిక పురోగతికి లభించే అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ముఖ్య ప్రాంతాల్లో కౌంట్‌డౌన్ స్క్రీన్‌ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జులై 31న అన్ని ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ దీపాల అలంకరణ చేయాలని అధికారులకు సూచించారు. విజేతలకు ప్రధాని ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనే ప్రత్యేక అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. పాంద్రంగి గ్రామం , ఇతర ప్రముఖ ప్రాంతాలలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్మారకార్థం జానపద నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్థానిక గిరిజన ఉత్పత్తులైన అరకు కాఫీ, పసుపు మొదలైన వాటికి అంతర్జాతీయ మార్కెటింగ్ అవకాశాలకై ప్రత్యేక కార్యక్రమాలు మరియు పారిశ్రామికవేత్తల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా భోగాపురం థీమ్‌తో క్రికెట్, బీచ్ వాలీబాల్ టోర్నమెంట్లు, విద్యార్థుల ఫ్లాష్ మోబ్‌లు మరియు భారీ రంగులవల్లి (రంగోలి) పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



# పుష్కర పనుల్లో పారదర్శకత లేదు.. ట్రాఫిక్‌ను దేవుడే నడిపిస్తున్నాడు: ఆర్పిసి

రాజమహేంద్రవరం: జయ జయహే: జూలై 27:

2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో పారదర్శకత కనిపించడం లేదని, పనులు తీవ్ర జాప్యానికి గురవుతున్నాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు ఆరోపించారు. ఆర్పిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన వారాంత సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పుష్కరాలకు సంబంధించిన పనులకు నిధుల విడుదలలో ఆలస్యం జరుగుతోందని, ప్రచారానికి తప్ప క్షేత్రస్థాయిలో పనులు కనిపించడం లేదన్నారు.గత పుష్కరాల్లో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా పార్టీ అధినేత మేడా శ్రీనివాస్ ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా సూచనలు చేసినప్పటికీ స్పందన లేదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.రాజమహేంద్రవరంలోని ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయాన్ని దక్షిణ కాశీగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆలయ అభివృద్ధితో పర్యాటకం, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఆదాయం పెరుగుతాయని పేర్కొన్నారు.నగరంలో ట్రాఫిక్ నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు కనిపించడం లేదని కామరాజు విమర్శించారు. వాహన తనిఖీల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ అవినీతికి పాల్పడుతున్నారంటూ ఆరోపించారు.ఈ సమావేశానికి ఆర్పీసీ సీనియర్ సెక్యులర్ సిమ్మా దుర్గారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో డి.వి. రమణమూర్తి, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, కారుమూరి యుగంధర్, గుడ్ల సాయి దుర్గాప్రసాద్, బసా సోనియా, చల్లా సాంబశివరావు, మాసా అప్పాయమ్మ, నాగూరి అన్నపూర్ణ, చల్లా అఖిల్, మాసా ప్రవీణ్, వాసుదేవ సుభాష్, మాసా ప్రమీల, నాగూరి దుర్గ, మాసా సుభద్ర, గెద్దాడ సుందరి, మాసా రాజేశ్వరి, మాసా సుభాష్, నాగూరి బాబి తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికి టీడీపీలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న సురేష్ కుమార్

పాడేరు (జయ జయహే)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం సోమవారం గబ్బంగి, గుత్తులపుట్టు పంచాయతీలో ఇంటింటా టీడీపీ కార్యక్రమం తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ అధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ కొట్టడమే కాకుండా, పోలవరం, ఉత్తరాంధ్రాలో 11ప్రాజెక్టులు పూర్తి దిశగా పనులు, పల్లెపండుగ కార్యక్రమంలో 8 వేల కిలో మీటర్లు మేర గ్రామీణ రహదారులు, గుంతలు లేని రహదారులు లక్ష్యంగా చర్యలు. మెగా డి ఎస్సి ద్వారా 16000, టీచర్ ఉద్యోగాలు నియామకాలు, ఉచిత ఇసుక, భోగాపురం లో జాతీయ స్థాయిలో విమానాశ్రయం ఏర్పాటు, పోలీస్ శాఖలో 6000,వేల ఉద్యోగాలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తుందన్నారు. అందుకే ఇది మంచి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి తామర మూర్తిబాబు, రాంబాబు, సత్తిబాబు, సీదారి రాంబాబు, సీదారి లక్ష్మయ్య, ఓలిబిరి ప్రసాద్, వరహాలమ్మా, తదితరులు పాల్గొన్నారు




# ఎపిలో క్రియేటివ్ ఎకానమీకి దుర్గేష్ గ్రీన్ సిగ్నల్

రాజమహేంద్రవరం: జయ జయహే జూలై 27

రాజమహేంద్రవరంలో పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ను ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎఫ్టిపిసిపోస్టర్, లోగోను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో క్రియేటివ్ ఎకానమీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో సినిమా, టెలివిజన్, ఓటీటీ రంగాలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు.'వన్ ఇండియా -- వన్ సినిమా' లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఎఫ్‌టీపీసీ కార్యక్రమాలను మంత్రి అభినందించారు. పాన్ ఇండియా సినిమాలు, ఓటీటీ వేదికల విస్తరణతో భాషా సరిహద్దులు చెరిగిపోయాయని, సినిమా థియేటర్లు, టెలివిజన్, ఓటీటీ రంగాలు సమాంతరంగా అభివృద్ధి చెందాలని సూచించారు.త్వరలో అమరావతి, తిరుపతి కేంద్రాలుగా క్రియేటివ్ ఎకానమీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని, ఎఫ్‌టీపీసీ చేపట్టే కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.మంత్రి కందుల దుర్గేష్, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

For a pure tomorrow..
జయహో

# వికసిత గ్రంథాలయాలే జ్ఞానాంధ్రకు బాటలు

## విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల ప్రస్థానం -- పురోగతి సవాళ్లు ప్రభుత్వ బాధ్యతలు

**ఒక రాష్ట్ర అభివృద్ధిని కొలవడానికి పరిశ్రమలు రహదారులు పెట్టుబడులు సాంకేతిక పురోగతి వంటి ప్రమాణాలు ఎంత ముఖ్యమో ఆ రాష్ట్రంలోని గ్రంథాలయాల స్థితి కూడా అంతే ముఖ్యమైనది. ఎందుకంటే గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిల్వ కేంద్రాలు కావు అవి జ్ఞానానికి, చైతన్యానికి పరిశోధనకు వ్యక్తిత్వ వికాసానికి ప్రజాస్వామ్య విలువలకు పునాదులు. ఒక సమాజం ఎంతగా చదువుతోందో ఎంతగా ఆలోచిస్తోందో తెలుసుకోవాలంటే అక్కడి గ్రంథాలయాలను పరిశీలిస్తే సరిపోతుంది.**

2014లో రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ దశలోకి ప్రవేశించింది. కొత్త రాజధాని కొత్త పరిపాలనా నిర్మాణం విద్యా సంస్థల పునర్వ్యవస్థీకరణ వంటి అనేక మార్పుల మధ్య గ్రంథాలయ రంగం కూడా తనదైన ప్రయాణాన్ని కొనసాగించింది. ఈ పన్నెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ గ్రంథాలయాలు కళాశాలల గ్రంథాలయాలు కొన్ని రంగాల్లో గణనీయ పురోగతి సాధించగా మరికొన్ని రంగాల్లో ఇంకా అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్నాయి.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రజా గ్రంథాలయ వ్యవస్థలో సుమారు 990 ప్రజా గ్రంథాలయాలు, 4.43 లక్షలకు పైగా పుస్తకాలు, 7.14 లక్షలకు పైగా నమోదిత సభ్యులు, 18 వేలకుపైగా డిజిటలైజ్ చేసిన గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, ఉద్యోగార్థులు, పరిశోధకులు సాధారణ పాఠకులు ఈ సేవలను వినియోగిస్తున్నారు. ఈ సంఖ్యలు ఆశాజనకంగానే కనిపించినప్పటికీ, ఐదు కోట్లకు పైగా జనాభా కలిగిన రాష్ట్రానికి ఇవి సరిపోతున్నాయా అనే ప్రశ్నను కూడా మనం ఎదుర్కోవాల్సిందే.

దేశవ్యాప్తంగా సుమారు 46 వేలకుపైగా ప్రజా గ్రంథాలయాలు ఉన్నాయని అంచనాలు చెబుతున్నాయి. ఆ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు వెయ్యి గ్రంథాలయాలు ఉండటం ఒక బలమైన వ్యవస్థకు సంకేతమే. అయినప్పటికీ ప్రతి లక్ష జనాభాకు అందుబాటులో ఉన్న గ్రంథాలయాల నిష్పత్తి, పుస్తకాల లభ్యత, సిబ్బంది అందుబాటు వంటి అంశాల్లో ఇంకా మెరుగుదలకు అవకాశం ఉంది.

విభజన తర్వాత డిజిటల్ యుగానికి అనుగుణంగా మారేందుకు



గ్రంథాలయ శాఖ చేపట్టిన చర్యలు ప్రశంసనీయం. పుస్తకాల డిజిటలైజేషన్ ఈ-లైబ్రరీ సేవలు ఆన్‌లైన్ కేటలాగ్‌లు, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు పోటీ పరీక్షల విభాగాలు విద్యార్థుల కోసం ప్రత్యేక అధ్యయన కేంద్రాలు వంటి కార్యక్రమాలు గ్రంథాలయాల రూపురేఖలను మార్చుతున్నాయి. సంప్రదాయ పుస్తకాల నిల్వ కేంద్రం నుంచి జ్ఞాన వనరుల కేంద్రంగా మారే దిశగా అడుగులు పడుతున్నాయి.

కళాశాలల గ్రంథాలయాల విషయంలో కూడా గణనీయ మార్పులు చోటుచేసుకున్నాయి. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ మరియు పాలిటెక్నిక్ సంస్థలు డిజిటల్ వనరులను విస్తరించాయి. ఉదాహరణకు ఆంధ్ర విశ్వవిద్యాలయ గ్రంథాలయంలోనే 5.41 లక్షల పుస్తకాలు, 11,964 పరిశోధనా జర్నల్స్, 21 వేలకుపైగా నమోదిత వినియోగదారులు ఉన్నారు. ఇది ఉన్నత విద్యలో గ్రంథాలయాల ప్రాధాన్యాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. జాతీయ డిజిటల్ లైబ్రరీ, ఈ-జర్నల్స్, ఈ-బుక్స్ ద్వారా ప్రపంచ జ్ఞానాన్ని విద్యార్థులకు చేరువ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అయితే అభివృద్ధి చిత్రానికి మరోవైపు కూడా ఉంది. రాష్ట్రంలోని అనేక గ్రామీణ గ్రంథాలయాలు ఇంకా కనీస మౌలిక సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నాయి. పాత భవనాలు, పరిమిత ఫర్నిచర్, కంప్యూటర్ల కొరత, ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. కొన్ని గ్రంథాలయాలు స్థానిక సంస్థల సహకారంతో నడుస్తుండగా, మరికొన్ని నిధుల కొరతతో తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నాయి.

ఈ నేపథ్యంలో గ్రంథపాలకులు మరియు గ్రంథాలయ సిబ్బంది పరిస్థితి ప్రత్యేక ప్రస్తావనకు అర్హం. రాష్ట్రవ్యాప్తంగా అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయాల్లో కేవలం 10 నుండి 14 మంది సిబ్బందితోనే వేలాది పుస్తకాల నిర్వహణ, పాఠక సేవలు, డిజిటల్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పదోన్నతుల ఆలస్యం, శిక్షణా అవకాశాల కొరత, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు, పరిమిత వేతనాలు వంటి సమస్యలు గ్రంథాలయ రంగ అభివృద్ధిపై ప్రభావం చూపుతున్నాయి. జ్ఞాన సేవలను అందిస్తున్న ఈ వర్గానికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం, సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత.

ఇంకో ప్రధాన సమస్య పఠన సంస్కృతి క్షీణత. ఒకప్పుడు పుస్తక పఠనం ఒక సామాజిక అలవాటు. గ్రంథాలయాలు యువతతో కళకళలాడేవి. నేడు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, తక్షణ వినోదం పుస్తక పఠనాన్ని వెనక్కు నెట్టాయి. సమాచారం అపారంగా అందుబాటులో ఉన్నప్పటికీ లోతైన అధ్యయనం తగ్గిపోతోంది. ఈ పరిస్థితి భవిష్యత్తు తరాల ఆలోచనా సామర్థ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

రాష్ట్ర అక్షరాస్యత శాతం సుమారు 72.6 శాతం వద్ద ఉండటం కూడా పఠన సంస్కృతి బలోపేతం అవసరాన్ని గుర్తు చేస్తోంది. అక్షరాస్యత పెంపు, గ్రంథాలయాల అభివృద్ధి, పఠన అలవాట్ల విస్తరణ పరస్పర అనుసంధానమైన అంశాలు. చదివే సమాజమే ఆలోచించే సమాజం.

ఆలోచించే సమాజమే అభివృద్ధి చెందే సమాజం.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరింత దూరదృష్టితో ముందుకు రావాలి. అమరావతిలో రూ.150 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాల రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం విశాఖపట్నంలో మోడల్ గ్రంథాలయం ఏర్పాటు ప్రతిపాదనలు స్వాగతించదగినవే. అయితే కొత్త భవనాల నిర్మాణం మాత్రమే సరిపోదు. ఖాళీ పోస్టుల భర్తీ, గ్రామీణ గ్రంథాలయాల పునరుద్ధరణ, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ, కొత్త పుస్తకాల కొనుగోలు, సిబ్బంది శిక్షణ, పాఠక సేవల ఆధునీకరణపై సమాన దృష్టి అవసరం.

ప్రతి జిల్లాలో ఒక మోడల్ లైబ్రరీ, ప్రతి మండలంలో ఆధునిక అధ్యయన కేంద్రం, ప్రతి గ్రామంలో చురుకైన పఠన కేంద్రం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. దివ్యాంగులు, మహిళలు, పిల్లలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం ప్రత్యేక పఠన విభాగాలు, ఉచిత వై-ఫై, డిజిటల్ రీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి.

అంతకంటే ముఖ్యంగా ప్రజల్లో పఠన చైతన్యాన్ని మళ్లీ రగిలించాలి. “ఒక నెల -- ఒక పుస్తకం”, “ఒక గ్రామం -- ఒక గ్రంథాలయం”, “ఒక కుటుంబం -- ఒక పఠన గంట” వంటి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంగా చేపట్టాలి. పుస్తకోత్సవాలు, రచయితలతో సమావేశాలు, పాఠకుల క్లబ్బులు, పుస్తక సమీక్ష పోటీలు, మొబైల్ గ్రంథాలయాలు నిర్వహించాలి. ఎక్కువ పుస్తకాలు చదివిన విద్యార్థులకు పురస్కారాలు అందించాలి. పాఠశాలల్లో రోజువారీ పఠన సమయాన్ని ప్రవేశపెట్టాలి.

తల్లిదండ్రులు కూడా పిల్లలకు పుస్తకాల విలువను తెలియజేయాలి. పుట్టినరోజులకు బహుమతిగా పుస్తకాలు ఇవ్వడం, ఇంట్లో చిన్న గ్రంథాలయం ఏర్పాటు చేయడం, కుటుంబ సభ్యులు కలిసి చదివే సంస్కృతిని పెంపొందించడం అవసరం. పుస్తకం కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చే సాధనం కాదు; అది మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే గురువు.

చరిత్ర చెబుతోంది---నలందా, తక్షశిల, అలెగ్జాండ్రియా, బ్రిటిష్ లైబ్రరీ, అమెరికా కాంగ్రెస్ లైబ్రరీ వంటి జ్ఞాన కేంద్రాల వెనుక గొప్ప నాగరికతలు ఉన్నాయి. జ్ఞానాన్ని గౌరవించిన సమాజాలే ప్రపంచాన్ని నడిపించాయి. అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ కూడా తన గ్రంథాలయ వ్యవస్థను పునరుజ్జీవింపజేయాలి.

కొత్త పాఠకులు. కేవలం పుస్తకాల కొనుగోలు కాదు; పఠన సంస్కృతి. కేవలం డిజిటల్ సదుపాయాలు కాదు; ప్రభుత్వం, గ్రంథపాలకులు, విద్యాసంస్థలు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు, యువత అందరూ కలిసి పనిచేసినప్పుడే గ్రంథాలయ ఉద్యమానికి కొత్త ఊపు వస్తుంది.

రహదారులు ప్రయాణాన్ని సులభతరం చేస్తాయి. పరిశ్రమలు ఉపాధిని కల్పిస్తాయి. కానీ గ్రంథాలయాలు ఆలోచించే పౌరులను తయారు చేస్తాయి. అందుకే గ్రంథాలయాలపై పెట్టే ప్రతి రూపాయి ఖర్చు కాదు---అది భవిష్యత్తుపై పెట్టుబడి.

గ్రంథాలయాలను కాపాడటం అంటే పుస్తకాలను కాపాడటం మాత్రమే కాదు భవిష్యత్తు తరాల జ్ఞాన సంపదను కాపాడటమే. గ్రంథాలయాల పునరుజ్జీవనమే జ్ఞానాంధ్రకు నిజమైన మార్గం.

డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్9640687608

# సమగ్రాభివృద్ధికి అవినీతి సమగ్ర నిర్మూలన అవసరం

(ప్రతాప్)

**ఒక దేశం లేదా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే భారీ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, పెట్టుబడులు మాత్రమే సరిపోవు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే పారదర్శక పాలన, జవాబుదారీతనం కూడా అంతే అవసరం. ఈ రెండింటికి అతిపెద్ద అడ్డంకిగా నిలిచేది అవినీతి. ప్రజల సంక్షేమం కోసం కేటాయించిన వనరులు లక్ష్యానికి చేరకుండా మధ్యలోనే దారి మళ్లితే, దాని ప్రభావం కేవలం ప్రభుత్వ ఖజానాపైనే కాదు, ప్రతి పౌరుడి జీవితంపైనా పడుతుంది.**

అవినీతి వల్ల ప్రజలకు అందాల్సిన మౌలిక సదు-పాయాల నాణ్యత దెబ్బతింటుంది. రహదారులు, తాగునీటి పథకాలు, విద్యా సంస్థలు, వైద్య సేవలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు వంటి రంగాల్లో నిధులు సక్రమంగా వినియోగం కాకపోతే పనులు ఆలస్యమవడం, వ్యయాలు పెరగడం, నాణ్యత తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అధికారికంగా భారీ వ్యయం జరిగినట్లు కనిపించినా, ప్రజలకు అందే ప్రయోజనం మాత్రం ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చు.

అవినీతి ప్రజల జీవన ప్రమాణాలపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. మౌలిక వసతులు సరిగా అందుబాటులో లేకపోవడం వల్ల విద్య, ఆరోగ్యం, ఉపాధి, రవాణా వంటి రంగాల్లో సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ప్రభుత్వ సేవలు పొందడానికి అదనపు ఖర్చులు, ఆలస్యాలు ఎదురైతే సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం మరింత పెరుగుతుంది.

ఆర్థికాభివృద్ధిపైనా అవినీతి తీవ్ర ప్రభావం చూపుతుంది. నియామకాలు, కొనుగోళ్లు, కాంట్రాక్టుల కేటాయింపుల్లో పారదర్శకత లేకపోతే ప్రతిభకు బదులుగా అనుచిత ప్రయోజనాలు ప్రాధాన్యం పొందే ప్రమాదం ఉంటుంది. దీంతో నిజాయితీగా పనిచేసే సంస్థలు, యువత అవకాశాలు కోల్పోతారు. పెట్టుబడిదారుల విశ్వాసం తగ్గి, పోటీ వాతావరణం బలహీనపడుతుంది. దీర్ఘకాలంలో ఇది ఉపాధి అవకాశాలను తగ్గించి, స్థిరమైన ఆర్థిక వృద్ధికి ఆటంకంగా మారుతుంది.

అవినీతి వల్ల కలిగే అత్యంత తీవ్రమైన నష్టం ప్రజల విశ్వాసం దెబ్బతినడమే. తప్పు చేసినవారు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారనే భావన కలిగితే ప్రభుత్వ వ్యవస్థలపై, న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకం క్రమంగా తగ్గిపోతుంది. చట్టం అందరికీ సమానంగా వర్తించదనే అభిప్రాయం పెరిగితే ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడే అవకాశం ఉంటుంది. ప్రజల భాగస్వామ్యం తగ్గి, సామాజిక బాధ్యత కూడా క్షీణిస్తుంది.

అవినీతిని అరికట్టేందుకు కఠిన చట్టాలు మాత్రమే సరిపోవు. ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకతను పెంచడం, డిజిటల్ సేవలను విస్తరించడం, టెండర్లు, నియామకాలు, నిధుల వినియోగంలో బహిరంగ సమాచార వ్యవస్థలను బలోపేతం చేయడం అవసరం. సామాజిక తనిఖీలు, స్వతంత్ర పర్యవేక్షణ సంస్థలు, సమర్థవంతమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. అదే సమయంలో ప్రజల్లో నైతిక విలువలు, అవినీతిని నిరసించే సామాజిక చైతన్యం పెరగడం కూడా అంతే ముఖ్యం.

సమగ్ర అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి కాదు; ప్రతి పౌరుడికి నాణ్యమైన సేవలు, సమాన అవకాశాలు, పారదర్శక పరిపాలన అందుబాటులో ఉండటం. అందుకోసం అవినీతిపై నిరంతర పోరాటం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజమంతటి కర్తవ్యం కూడా. పారదర్శకత, జవాబుదారీతనం, నిష్పాక్షిక పరిపాలన బలోపేతమైతేనే ప్రజల విశ్వాసం పెరిగి, అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ సమానంగా చేరే అవకాశం ఉంటుంది.

# సమ్మిళిత అభివృద్ధే దేశాభివృద్ధికి శాశ్వత మార్గం

(ప్రతాప్)

**ఆర్థిక వృద్ధి సాధించడం ఒక్కటే అభివృద్ధికి కొలమానం కాదు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ సమానంగా అందినప్పుడే దానిని నిజమైన అభివృద్ధిగా పరిగణించవచ్చు. ఈ భావననే సమ్మిళిత అభివృద్ధి అంటారు. అంటే ఆదాయం, విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, రాజకీయ భాగస్వామ్యం వంటి రంగాల్లో ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించడం. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్‌కు ప్రస్తుతం అత్యంత అవసరమైనది ఇదే.**



సమ్మిళిత అభివృద్ధి ఆర్థిక పురోగతితోపాటు సామాజిక న్యాయాన్నీ సమానంగా ప్రాధాన్యపెడుతుంది. జీడీపీ పెరుగుదలతో మాత్రమే దేశం అభివృద్ధి చెందిందని చెప్పలేం. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి, అసమానతలు తగ్గాలి, బలహీన వర్గాలు ప్రధాన అభివృద్ధి ప్రవాహంలో భాగస్వాములు కావాలి. ఈ దృక్పథంలోనే సమ్మిళిత అభివృద్ధి సమగ్ర పురోగతికి మార్గదర్శకంగా నిలుస్తుంది.

భారత అభివృద్ధి నమూనా మూడు ప్రధాన స్తంభాలపై ఆధారపడి ఉంది. మొదటిది మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, ఇది ఉపాధి, పెట్టుబడులు, వ్యాపార అవకాశాలను పెంచుతుంది. రెండవది సాధికారత, అంటే విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, సామాజిక భద్రత ద్వారా ప్రతి వ్యక్తిని స్వయం సమర్థుడిగా తీర్చిదిద్దడం. మూడవది ఆచరణాత్మక విధానాలు, అంటే పరిస్థితులకు అనుగుణంగా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని విధానాలను అమలు చేయడం.

ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన ఇన్‌క్లూజివ్ డెవలప్‌మెంట్ ఇండెక్స్-2018లో అభివృద్ధి చెందుతున్న 74 దేశాల్లో భారత్ 62వ స్థానంలో నిలిచింది. ఈ గణాంకం అభివృద్ధి అవకాశాలను సమాజంలోని ప్రతి వర్గానికి చేరవేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ఆర్థిక వృద్ధితో పాటు సామాజిక సమానత్వం సాధించడంపైన మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఇది సూచిస్తుంది.

సమ్మిళిత అభివృద్ధి సాధించడంలో మూడు అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. మొదటిది సుపరిపాలన. పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన పరిపాలన, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో సమన్వయం అభివృద్ధికి బలమైన పునాది వేస్తాయి. రెండవది నిర్మాణాత్మక పరివర్తన. గ్రామీణాభివృద్ధి, పట్టణీకరణ, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం విస్తరణ వంటి అంశాలు సామాజిక, ఆర్థిక మార్పులకు దోహదపడతాయి. మూడవది బహుముఖ విధానాల అమలు. స్థిరమైన ఆర్థిక విధానాలు, బలమైన సంస్థలు, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం, సమర్థవంతమైన సంక్షేమ కార్యక్రమాలు కలిసి సమ్మిళిత అభివృద్ధిని వేగవంతం చేస్తాయి.

సమాజంలోని కొన్ని వర్గాలకు ప్రత్యేక శ్రద్ధ అవసరం. గిరిజనులు, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన విద్య, విద్యుత్, రహదారులు, డిజిటల్ కనెక్టివిటీ, పక్కా గృహాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావాలి. దివ్యాంగులకు ర్యాంపులు, వీల్‌చైర్లు, దృశ్య-శ్రవణ సహాయక పరికరాలు, ఉపాధి నైపుణ్యాలు, అందుబాటు మౌలిక వసతులు కల్పించాలి. బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న వర్గాల్లో ఆర్థిక అక్షరాస్యత పెంచి డిజిటల్ బ్యాంకింగ్‌ను విస్తరించాలి. మహిళలకు గర్భధారణ ముందు, తరువాత ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, ఆర్థిక స్వావలంబనకు అవకాశాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.

సమ్మిళిత వృద్ధి మరియు సమ్మిళిత అభివృద్ధి మధ్య తేడా కూడా గుర్తించాలి. సమ్మిళిత వృద్ధి ప్రధానంగా ఆదాయం, ఉపాధి, ఆర్థిక అవకాశాలపై దృష్టి పెడితే, సమ్మిళిత అభివృద్ధి విద్య, ఆరోగ్యం, సామాజిక న్యాయం, మౌలిక వసతులు, జీవన నాణ్యత వంటి విస్తృత అంశాలను కలుపుకొని ముందుకు సాగుతుంది. అందువల్ల ఇది మరింత సమగ్ర భావన.

భారత రాజ్యాంగం సమ్మిళిత అభివృద్ధికి బలమైన పునాది వేసింది. సమానత్వ హక్కు, వివక్ష నిషేధం, ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు, విద్యా హక్కు, మైనారిటీల హక్కుల పరిరక్షణ వంటి ప్రాథమిక హక్కులు సమాజంలో సమానత్వాన్ని బలోపేతం చేస్తున్నాయి. అలాగే ఆదేశిక సూత్రాలు సామాజిక న్యాయం, బలహీన వర్గాల సంక్షేమం, అసమానతల తగ్గింపును లక్ష్యంగా నిర్దేశించాయి. స్థానిక స్వపరిపాలన వ్యవస్థలు, రిజర్వేషన్ విధానం, బలహీన వర్గాల రక్షణకు రూపొందించిన చట్టాలు కూడా ఈ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయి.

సమ్మిళిత అభివృద్ధి సాధించడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; సమాజం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పౌర సమాజ సంస్థలు, ప్రతి పౌరుడి భాగస్వామ్యం కూడా అవసరం. అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరినప్పుడే దేశం నిజమైన అర్థంలో శక్తివంతమైన, సమానత్వం కలిగిన, స్థిరమైన అభివృద్ధి మార్గంలో పయనిస్తుంది. అందువల్ల నేటి భారతదేశానికి సమ్మిళిత అభివృద్ధి ఒక విధానం మాత్రమే కాదు, సమాజ శ్రేయస్సుకు అత్యవసరమైన జాతీయ సంకల్పంగా మారాలి.

# ఇంటింటికీ కూటమి.. ప్రజల వద్దకే పాలన

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 27:**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సోమవారం 1వ డివిజన్ బత్తిననగర్‌లో డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజన్ ఇంచార్జ్ కడలి రామకృష్ణ పర్యవేక్షణలో గన్ని కృష్ణ, యర్రా వేణుగోపాల రాయుడు, మజ్జి రాంబాబు, వై శ్రీను, ఉప్పులూరి జానకిరామయ్య, కోసూరి చండిప్రియ, కప్పల వెలుగు కుమారి తదితర కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదమే కూటమి ప్రభుత్వానికి బలమని, రెండేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని అన్నారు. 'తల్లికి వందనం', 'స్త్రీ శక్తి', 'అన్నదాత సుఖీభవ', 'ఎన్టీఆర్ భరోసా', మహిళా సాధికారత, పోలవరం, గ్రీన్ ఎనర్జీ, గుడ్ గవర్నెన్స్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టులో కొత్త ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, రాజమహేంద్రవరం నగరంలో 9 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం నగరంలో రూ.300 కోట్లకు పైగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, రూ.100 కోట్లతో రివర్‌ఫ్రంట్, రూ.95 కోట్లతో అమృత్--2.0 తాగునీటి ప్రాజెక్టు, రూ.14 కోట్ల ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, రూ.140 కోట్ల డ్రైనేజీ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. సిఎస్ఆర్ నిధులతో విద్య, వైద్య రంగాలకు రూ.8 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. డోర్ టూ డోర్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని సుమారు 89 వేల ఇళ్లను సందర్శించి ప్రభుత్వ రెండేళ్ల విజయాలు, నగర అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. మూడు కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం విజయోత్సవ ప్రచారం

**అనకాపల్లి.జయ జయహే**

అనకాపల్లి జీవీఎంసీ 82వ ఆర్టిసి కాంప్లెక్స్ సమీపంలో పెదురెల్లి వీధిలో నిర్వహించిన ఇంటింటికి కూటమి ప్రభుత్వం విజయోత్సవ ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ పాల్గొన్నారు ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాలు అమలు చేసిన పథకాలు సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న దని అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరాలా కృషి చేస్తున్నదని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర కూ టమి నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళా మణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## అక్రమ గో రవాణాపై ఎస్పీకి జనతా వారధి వినతి

**రాజమహేంద్రవరం: జయ జయహే:జూలై 27:**

గోవధ, గోవుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టి, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, చట్టబద్ధంగా సమాచారం అందించే గో రక్షకులపై అనవసర కేసులు నమోదు చేయవద్దని భారతీయ జనతా పార్టీ తూర్పుగోదావరి జిల్లా నాయకులు జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. బిజెపి జిల్లా కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే 'జనతా వారధి' కార్యక్రమంలో ఈ అంశంపై పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. గోవధ, అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా, ఫిర్యాదులపై తక్షణ స్పందన, సంయుక్త తనిఖీలు, నేరస్థులపై కఠిన చర్యలు, గోశాలల సంరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. అదే సమయంలో గో రక్షణ పేరుతో చట్టవ్యతిరేక చర్యలు జరగకుండా చూడడంతో పాటు, చట్టబద్ధంగా సమాచారం ఇచ్చిన వారిపై నిష్పాక్షిక విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే ప్రజా మద్దతుతో ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జనతా వారధి కో-కన్వీనర్ బండి సత్యప్రసాద్, యానాపు ఏసు, స్వామి సూర్యకిరణ్, మీనాక్షి, శేషాద్రి రవిశంకర్ పాల్గొన్నారు.




## ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల చలో విజయవాడ" భారీ ధర్నా

**విజయవాడ (జయ జయహే)**


విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఆర్టీసీ ఔట్సోర్సింగ్ చలో విజయవాడ భారీ ధర్నా నిర్వహించారు . రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో సుమారు 8,000 మంది ఔట్సోర్సింగ్ ఆర్టీసీలో థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, తదితర న్యాయమైన 16 డిమాండ్లను ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తామని డిమాండ్ చేశారు ,విజయనగరం ఆర్టీసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఏ అశోక్ మాట్లాడుతూ సమస్యలపై యూనియన్ ఏర్పడినప్పటి నుండి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు తగిన న్యాయం జరగలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కమిటీ మరియు ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా కార్మికులతో కలిసి "చలో విజయవాడ" పేరుతో భారీ ధర్నా కార్యక్రమం చేస్తామని డిమాండ్ చేశారు.



## పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**అనకాపల్లి జయ జయహే**

పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎప్పటి నుంచి ప్రణాళిక బద్ధంగా ప్రత్యేకత నిర్వహించాలని అనకాపల్లి మండల విద్యాశాఖ అధికారి బి కే ఎస్ విశ్వేశ్వరరావు కోరారు మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు కొత్తగా పదవ తరగతి వచ్చి న ఈ పాఠశాల విద్యార్థులకు తొలిసారిగా పదవ తరగతి పరీక్షలుగా హాజరవుతున్నందున మంచి ఫలితాలను సాధించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు శాస్త్రి, సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు



## అథ్లెటిక్ ఈవెంట్స్‌లో పల్లిపాలెం విద్యార్థులు ఘనవిజయం

**కాజులూరు (జయ జయహే) న్యూస్ ..**

అమరావతి ఛాంపియన్షిప్ 2026- 27 రామచంద్రపురం నియోజకవర్గం స్థాయిలో జరిగిన అథ్లెటిక్ ఈవెంట్స్ లో పల్లిపాలెం జడ్.పి.హెచ్.ఎస్ పల్లిపాలెం పాఠశాల విద్యార్థులు ఘనవిజయం సాధించారు. విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక అవ్వడమే కాకుండా నియోజకవర్గ స్థాయి లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆర్చరీ నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థి ఎస్కే నబీల్ , పలివెల సందీప్ మరియు హై జంప్ అథలేట్ ఈవెంట్ సంబంధించి ఎం రాజ కుమార్ ఎంపిక కాబడ్డారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీధర్ మరియు ఉపాధ్యాయులు పి.డి కుమార్ ధ్రువీకరించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎస్కే షరీఫ్ , ఓ. బంగారేశ్వర శర్మ,గోపి మరియు స్థానిక ఆంధ్రీకుటీరం మధునాపంతుల సత్యనారాయణ మూర్తి విజేతలను అభినందించారు.

## అన్ని బస్సులు టైమింగ్లు బోర్డులో ఏర్పాటు చేయాలి

**మాడుగుల జూలై 27 జయ జయహే**



మాడుగులలో ఇటీవల జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మాడుగుల కు రాకపోకలు సాగించే అన్ని బస్సుల వివరాలు టైమింగ్స్ ఏర్పాటు చేయాలని జనసేన నాయకుడు రబ్బ మహేష్ జిల్లా కలెక్టర్ను కోరారు. నీతో స్పందించిన కలెక్టర్ వెంటనే అనకాపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ కు ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం మాడుగుల బస్సు షెల్టర్ లో అనకాపల్లి విశాఖపట్నం వెళ్లే బస్సుల రాకపోకల వివరాలను తెలిపారు. దీనిపై వర్షం వ్యక్తం చేసిన కూటమి నాయకులు మహేష్, త్రినాధరావు, ఈశ్వరరావు తదితరులు మాట్లాడుతూ ఈ బోర్డులో పూర్తిస్థాయిలో సమాచారం లేదని కేవలం అనకాపల్లి విశాఖపట్నం బస్సులు వివరాలు మాత్రమే ఉన్నాయని ఈ పాడేరు వెళ్లే బస్సులు కానీ రాజమండ్రి, కాకినాడ వెళ్లి బస్సులు వివరాలు గానీ లేవన్నారు వాటిని కూడా వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.



## అప్సోర్ రిజర్వాయర్ పూర్తి జరుగుతుందా ?

### మంత్రి కింజరాపు అచ్చన్న కు సిపిఎం సూటి ప్రశ్న

### పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్న హామీ లేవీ !

**టెక్కలి జూలై 27 జయ జయహే**


రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులన్ని పూర్తి చేస్తామన్న కూటమి ప్రభుత్వం హామీలేమైనాయని, అప్సోర్ రిజర్వాయర్ ఎప్పటికి పూర్తి చేస్తారని సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, జిల్లా కమిటీ ప్రతినిధులు నంబూరు షణ్ముఖరావు లు మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ను సూటిగా ప్రశ్నించారు. అప్సోర్ రిజర్వాయర్ ప్రాంతాలను సందర్శించిన అనంతరం నందిగాం మీడియా సమావేశంలో ఈ విధంగా తెలిపారు. అప్సోర్ రిజర్వాయర్ 2008 లో 125 కోట్ల రూపాయల వ్యయం తో నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ నేటికి 18 ఏళ్లు కావస్తున్న కనీసం 40% పనులు పూర్తి కాలేదని సిపిఎం ప్రతినిధులు విమర్శించారు. చాపర నుంచి రేగులపాడు వరకు 17 కిలోమీటర్లు కెనాల్ పూర్తి కావలసి ఉందని అందులో సగం పనులు కూడా పూర్తి కాలేదని ఇది పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. అప్సోర్ రిజర్వాయర్ నిర్మాణం జరిగితే నందిగాం, పలాస, టెక్కలి, మెలియాపుట్టి, మండలాల్లో 108 గ్రామాల్లో 24వేల 600 ఎకరాల భూములకు వ్యవసాయ సాగునీరు అందుతుందన్నారు, పలాస మండలానికి త్రాగునీరు సరఫరా జరుగుతుందన్నారు. అప్సోర్ రిజర్వాయర్ నీళ్లతో నందిగాం మండలంలో 12,090 ఎకరాలు, టెక్కలి 1820 ఎకరాలు, మెలియాపుట్టి 3890 ఎకరాలు, పలాస 6,800 ఎకరాలకు నీళ్లు అంది వ్యవసాయ సాగు జరుగుతుందన్నారు. అప్సోర్ కు మరో 450 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వంశధార రిజర్వాయర్కు 200 కోట్లు కేటాయిస్తే రెండు పంటలకుసాగు నీళ్లు అందించవచ్చు అన్నారు, ప్రస్తుతం వంశధార బ్యారేజ్ శిధిలావస్థలో ఉందని దీనికి మరమ్మతులకు 1500 కోట్లు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. అలాగే వంశధార నాగావళి నదుల అనుసంధానానికి 100 కోట్లు కేటాయిస్తే నిర్మాణ పనుల పూర్తయి జిల్లా రైతుల సమగ్ర సంక్షేమ అభివృద్ధి జరుగుతుందని సిపిఎం ప్రతినిధులు హనుమంతు ఈశ్వరరావు, కొల్లి ఎల్లయ్య, పాలిని సాంబమూర్తి, బాగాది వాసుదేవరావు, తదితరులు డిమాండ్ చేశారు.



## చోడవరం యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో చోరీ యత్నం

### కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసిన చోడవరం పోలీసులు

**చోడవరం జూలై 27 జయ జయహే**



చోడవరం వినాయక ఆలయం సమీపంలో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో చోరీకి యత్నించిన ఘటనపై చోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ మేరకు చోడవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ పోలిపల్లి వెంకట వరప్రసాద్ (52), ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సోమవారం తెల్లవారుజామున 2:45 గంటల నుండి 3:29 గంటల మధ్య గుర్తు తెలియని వ్యక్తి ఏటీఎంలోకి ప్రవేశించి, తన వెంట తీసుకువచ్చిన పనిముట్లతో ఏటీఎం నగదు నిల్వ బాక్స్ ను తెరవడానికి పలుమార్లు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఏటీఎం బయటి భాగానికి కొంత నష్టం కలిగించినప్పటికీ, నగదు నిల్వ గదిని తెరవడంలో విఫలమై అక్కడి నుంచి పరారయ్యాడు. సంఘటన స్థలంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ, నిందితుడిని గుర్తించి త్వరలోనే అరెస్టు చేసేందుకు చోడవరం ఎస్ హెచ్ ఓ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. నిందితుడి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం లేదా అనుమానాస్పద వ్యక్తుల గురించి ఏదైనా సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే చోడవరం పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ 94407 96090 నెంబర్లకు లేదా ఎస్సై బి. జోగారావును పీహెచ్ 81429 36937 నంబర్‌లో సంప్రదించాలని చోడవరం పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు.

# 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

### ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్

**అరకు వేలి: జులై 27, జయ జయహే.**




అల్లూరి సీతారామరాజు జిల్లా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అలాగే ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ పిలుపు మేరకు అరకు లోయ మండల కేంద్రంలోని 1/70 చట్టం పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అఖిల పక్ష ఉద్యోగ , ఉపాధ్యాయ ప్రజా సంఘాలు కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి డా బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం లో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం,అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మసడ ఈశ్వరరావు , ప్రధాన కార్యదర్శి ఎం.శేషాద్రి ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ రామారావు దొర మాట్లాడుతూ రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న ఆదివాసి చట్టాలు 1/70, పెసా చట్టం, అడవి హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,అలాగే జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేసి స్థానిక గిరిజనుల కే 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.గిరిజనులకు రక్షణ కవచమైన 1/70 చట్టాన్ని సవరించి తమకు గిరిజన ప్రాంతంలో సర్వహక్కులు కల్పించాలని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వారిపై ఎస్టీఆర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సంబంధిత అధికారులను కోరారు,అనంతరం అరకులోయ తహశీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.వినతి పత్రం సమర్పించిన వారిలో అఖిలపక్షం నాయకులు చిన్నారావు, ప్రకాష్, శాంతి కుమారి, చాణక్య, అశోక్, పరశురాం, అరకు జోన్ ఉద్యోగ సంఘం నాయకులు పి నందు, గురుదొర,సింహాచలం,ధనుర్జయ్,రామ్ ప్రసాద్, మండల అధ్యక్షుడు ఆనంద్ రావు,చందు, ప్రసాద్ (పిడి) పాల్గొన్నారు.



## డాక్టర్ ఏ పి జె అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ

**అనకాపల్లి (జయ జయహే)**

అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో భారత రక్షణ రంగాన్ని అగ్రపదంలో నిలిపిన మహోన్నత వ్యక్తి భారతదేశ 11,వ రాష్ట్రపతి మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 11,వ వర్ధంతి సందర్భంగా జార్జ్ క్లబ్ ఎదురుగా ఏ.పీ.జే అబ్దుల్ కలాం మొట్ట మొదటి విగ్రహాన్ని ఏర్పాటు చేసారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఏ.ఎం.ఏ.ఎల్. కళాశాల ప్రాంగణంలో అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలోగజమాల వేసి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపల్ బొత్స సాగర్, ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా భారతదేశంలోనే మొట్టమొదటి వ్యక్తి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అలాగే విద్యార్థులు అందరూ అబ్దుల్ కలాం స్ఫూర్తిగా తీసుకోవాలని అబ్దుల్ కలాం చిన్న వయసు నుంచి ఆయన ఎంతో కష్టపడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కలాం వర్ధంతి సందర్భంగా ప్రతి ఒక్కరు జయంతి వర్ధంతి వేడుకలు, తప్పకుండా అనకాపల్లి జిల్లాలో అబ్దుల్ కలాం సేవా సంఘం స్థాపించిన నుండి ఈనాటి వరకు అనేక సేవా కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు, దేశ నాయకుల తాలూకా విగ్రహాలను ఏర్పాటు చేస్తూ ప్రజలకి అవగాహన కల్పిస్తున్న అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డి.వి.ఎన్. కాలేజ్ ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, డివిఎంసి మాజీ నెంబర్ రేబాక మధు, అబ్దుల్ కలాం సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతా లక్ష్మణరావు, అబ్దుల్ కలాం సేవా సంఘం సోషల్ మీడియా పసగాడా నాగేంద్ర, డివిఎన్ కాలేజ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## చీడిపాలెం సచివాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహణ

### 24 వినతుల స్వీకరణ

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ జులై 28,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం చీడిపాలెం గ్రామ సచివాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) జీడీవీ ప్రసాద్, తహసీల్దార్ కె. ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల వారీగా నమోదు చేసి, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీడీఓ, తహసీల్దార్ ఆదేశిస్తామని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు.ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 24 వినతులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ శాఖకు 17, పంచాయతీరాజ్ శాఖకు 2, ఐసీడీఎస్ శాఖకు 1, ఉపాధి హామీ పథకం (వీబీజీ రామ్ జి)కు 2, విద్యాశాఖకు 1, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖకు 1 వినతి అందాయి.ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని నిబంధనల మేరకు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేల చర్యలు తీసుకుంటామని తెలియజేసారు.



## పంచాయతీ నిధులతో నీరుబావి మరమ్మతులు

### గోపవరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామస్తుల సహకారం..


**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ జులై 28,**

అల్లూరు జిల్లా, కొయ్యూరు మండలం, చిట్టెంపాడు పంచాయతీ పరిధిలోని గోపవరం గ్రామంలో పంచాయతీ నిధులతో నీరుబావి మరమ్మత్తు పనులు చేపట్టారు. పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామ పెద్దల అంగీకారంతో గ్రామస్తులందరూ కలిసి శ్రమదానం చేసి పనులను పూర్తి చేశారు.గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించే లక్ష్యంతో ఈ మరమ్మత్తు పనులు చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్తులు తాగునీటి సమస్య పరిష్కారానికి సహకరించిన కూటమి ప్రభుత్వానికి, పంచాయతీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుమ్మ నాగరాజు, కాకర రాజబాబు, మామిడి నూకరాజు, సిగ్గే జగ్గారావు, పాడి బుల్లబ్బాయి పాల్గొన్నారు.అలాగే టీడీపీ కార్యకర్తలు పాడి ధారబాబు, గుమ్మ కొండలరావు, గుమ్మ అజయ్‌బాబు, జనసేన కార్యకర్తలు గుమ్మ తేజ, పాడి ఏసు, పాడి శ్రీను, మామిడి పవన్, మామిడి శ్రీరాంబాబు, కూడా శేషు, గ్రామ యువకులు శేఖర్ మాస్టర్, బన్నీ, లోకల్ గజిని, ఠాగూర్, గణేష్, రామ్ పంతులు, టెండూల్కర్, చిరంజీవి, రాజబాబు, రామోజి తదితరులు పాల్గొని పనులను విజయవంతం చేశారు.

## కోకోకోలా పైప్‌లైన్లను వెంటనే తొలగించాలి:

### కలెక్టర్‌కు సీపీఐ, సీపీఎం వినతి

**శ్రీకాళహస్తి,జూలై 27,జయ జయహే:**




శ్రీకాళహస్తి మండలంలో కోకోకోలా కంపెనీ యాజమాన్యం ప్రభుత్వ పంట కాలువల్లో అక్రమంగా వేసిన పైప్‌లైన్లను వెంటనే తొలగించాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సీపీఐ రాష్ట్ర నాయకులు రామానాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి మురళి నేతృత్వంలోని ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పంట కాలువల్లో అక్రమ పైప్‌లైన్ల వల్ల మండలంలోని 11 గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కలెక్టర్ వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య, కోడూరు కార్యదర్శి చెన్నయ్య, మహిళా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## వివాహిత అనుమానాస్పద మృతి

### కేసు నమోదు చేసిన చోడవరం పోలీసులు

**చోడవరం జులై 27 జయ జయహే**



చోడవరం మండలం దుడ్డుపాలెం గ్రామానికి చెందిన వివాహ ది కూర్మదాసు భవ్య శ్రీ (23 ) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందింది. ఈ మేరకు వెంకన్నపాలెం గ్రామానికి చెందిన మృతురాలు తల్లి గడదాసి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చోడవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, భవ్యశ్రీ వివాహం 2021 ఆగస్టు 22న దుడ్డుపాలెం గ్రామానికి చెందిన కుర్మదాసు శ్రీనుతో జరిగింది. వివాహ సమయంలో నగదు, బంగారు ఆభరణాలు ద్విచక్ర వాహనం కొనుగోలుకు నగదు రూపంలో కట్నం ఇచ్చినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. గత రెండేళ్లుగా భర్త కుర్మదాసు శ్రీను, అతని తమ్ముడు కుర్మదాసు హరి, వారి తల్లి కుర్మదాసు ఈశ్వరమ్మలు అదనపు కట్నం కోసం భవ్యశ్రీని మానసికంగా, శారీరకంగా వేధిస్తూ హింసించారని ఆరోపించారు. ఈనెల 27 ఉదయం భవ్యశ్రీ ఉరివేసుకుని మృతి చెందినట్లు ఆమె అత్తింటి కుటుంబ సభ్యులు తెలియజేయడంతో ఫిర్యాదుదారుకు విషయం తెలిసింది. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా భవ్యశ్రీ మృతదేహం పెదవిపై గాయం ఉన్నట్లు గమనించారని, తన కుమార్తె ఆత్మహత్య చేసుకునే స్వభావం కలిగినది కాదని, భర్త కుర్మదాసు శ్రీను, అతని తమ్ముడు కుర్మదాసు హరి, వారి తల్లి కుర్మదాసు ఈశ్వరమ్మలు కలిసి హత్య చేసి దానిని ఆత్మహత్యగా చిత్రీకరించారని అనుమానం వ్యక్తం చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా చోడవరం సీఐ పి. అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన స్థలాన్ని అనకాపల్లి ఎస్‌డీపీఓ, క్లూస్ టీమ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి శాస్త్రీయ ఆధారాలను సేకరించింది. అనంతరం చోడవరం తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉంది. పూర్తి విచారణ అనంతరం వెలుగులోకి వచ్చే వాస్తవాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయనీ సిఐ తెలిపారు.




## సీటీయూఏపీ క్రికెట్ జట్టుకు అభినందనలు

**విజయనగరం (జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూఏపీ) విద్యార్థి ప్రవీణ్ కుమార్ నాయకత్వంలోని విశ్వవిద్యాలయ క్రికెట్ జట్టు టెక్కలిలోని ఏఐటీఏఎం కళాశాల నిర్వహించిన అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి రన్నరప్గా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో భారత మాజీ క్రికెటర్ ఎం.ఎస్.కే. ప్రసాద్ సీటీయూఏపీ క్రికెట్ జట్టుకు రన్నరప్ ట్రోఫీ, జ్ఞాపికతో పాటు రూ.25,000 నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ విజయంపై విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ మరియు రిజిస్ట్రార్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా జట్టు సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్రీడా స్ఫూర్తి, జట్టు భావన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు విద్యార్థుల భవిష్యత్ విజయాలకు బలమైన పునాది వేస్తాయని తెలిపారు. సీటీయూఏపీ విద్యార్థులు విద్యా రంగంతో పాటు క్రీడల్లోనూ విశేష ప్రతిభ కనబరుస్తుండటం గర్వకారణమని, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయం క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని విధాల సహకారాన్ని అందిస్తుందని తెలిపారు.



## వైఎస్ షర్మిల త్వరగా కోలుకోవాలి

### చెంగాలమ్మ ఆలయంలో కాంగ్రెస్ ప్రత్యేక పూజలు

**సూళ్లూరుపేట,జూలై 27, జయ జయహే:**


ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి శస్త్రచికిత్స అనంతరం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, సూళ్లూరుపేట సమన్వయకర్త వెంకటాచలపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కరీముల్లా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు హరిబాబు, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు సునీల్ రెడ్డి, సుధా యాదవ్ మరియు నాయకులు కిరణ్, శ్వేత, విజయ్, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథ స్వామి భూముల వార్షిక వేలం

**మాడుగుల, జులై 27, జయ జయహే**



దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలో ఉన్న జగన్నాథ స్వామి ఆలయానికి చెందిన 10 ఎకరాల 26 సెంట్లు భూమికి సంబంధించి భూముల వేలంపాటను సోమవారం జగన్నాథ స్వామి ఆలయ ప్రాంగణంలో దేవాదాయ కార్య నిర్వహణ అధికారి పి.ఎం. ఎస్.శర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. దేవాదాయ శాఖ కౌలు పేరుతో మూడేళ్లకొకసారి నిర్వహిస్తున్న ఈ వేలం పాటలో రూ.14,800లు శిస్థు రూపంలో ఈ భూములకు సంబంధించి వేలంపాట ద్వారా ఆదాయం వచ్చిందని, ఈ భూముల వేలంపాట ద్వారా 8 మంది రైతులు కౌలుకు భూములు దక్కించుకున్నారని ఈవో తెలిపారు.ఈ కార్యక్రమం లో దేవాదాయశాఖ కార్యాలయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**చోడవరం జూలై 27 జయ జయహే**

ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి పై (ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు) చోడవరం మండలంలో గల అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం మండల స్థాయిలో వ్యాసరచన, డ్రాయింగ్ క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈపోటీలకు మండలంలో గల 14 ఉన్నత పాఠశాల లోనుంచి 42మంది విద్యార్థులు హాజరైయ్యారు.ఈ పోటీలను మండల విద్యాశాఖాధికారులు నీలకంఠం, సింహాచలం బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ రాష్ట్రంలో మన ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధిలో అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నాయని,త్వరలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం అవుతుందిని, రైల్వే జోన్ పనులు కూడా పూర్తి అవుతున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో యమ్.కుసుమ, క్విజ్ పోటీల్లో యమ్.శశాంక్, డ్రాయింగ్ పోటీల్లో వై.గ్రీష్మ గెలుపొందారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గంగాధర్,రమేష్, లక్ష్మి,కోటేశ్వరరావు, దేముడు ,ఈశ్వరరావు వ్యవహరించారు.సి.ఆర్.య-ఎమ్.టి లు నాయుడు, సరోజిని,భూలక్ష్మి చంద్రిక పాల్గొన్నారు.

# ఛలో తర్లివాడకు వెళ్తున్న వామపక్ష నేతల అరెస్ట్

**ఆనందపురం, జూలై 27:(జయ జయహే)**

ఆనందపురం మండలం తర్లివాడ గ్రామంలో ఆధానీ గూగుల్ డేటా సెంటర్ భూ సమస్యలపై రైతులను కలిసేందుకు వెళ్తున్న సీపీఐ సిపిఎం తదితర వామపక్ష పార్టీల నాయకులను పోలీసులు సోమవారం మార్గమధ్యంలో ఆనందపురం పెందుర్తి జాతీయ రహదారి తర్లువాడ జంక్షన్లో అదుపులోకి తీసుకుని ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తర్లివాడలో సమావేశం నిర్వహించకుండా ముందస్తు అరెస్టులు వామపక్ష నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సిపిఐ సిపిఎం నాయకులు కె లోకనాదం, ఎం పైడిరాజు, బి గంగారావు, ఎస్ కె రహిమాన్, ఎం జగ్గునాయుడు, ఎ విమల మాట్లాడుతూ నాయకులను స్టేషన్‌కు తరలించడంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై వామపక్ష నాయకులు పోలీసుల చర్యను ఖండిస్తూ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. డేటా సెంటర్లు వలన పర్యావరణం సర్వ నాశనం అవుతుందని, భూగర్భ జలాలు అడిగింటి సాగునీరు త్రాగునీరు ఉండదని తెలిపారు. డేటా సెంటర్లు వద్దని దేశ విదేశాల్లో ప్రజలు వ్యతిరేకించారని మన దేశంలోనే అది ఆంధ్రప్రదేశ్ లోనే పెడుతున్నారని అంత విలువైన డేటా సెంటర్లు ఐతే ముఖ్యమంత్రి గారు అమరావతిలో ఎందుకు పెట్టరని వామపక్ష నేతలు విమర్శించారు విశాఖ జిల్లా, ఉత్తరాంధ్రలోనే రసాయిన పరిశ్రమలు డేటా సెంటర్లు పెట్టి



అమాయక ఉత్తరాంధ్ర ప్రజలు జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సిపిఎం నాయకులు కె సత్యాంజనేయ, ఆర్ ఎస్ ఎన్ మూర్తి, కె వనజాక్షి, ఎం డి బేగం, ఎం మన్మధరావు ఆర్ శ్రీనివాసరావు, తదితరులతో పాటు సిపిఐ సిపిఎం ఇతర వామపక్ష పార్టీలు నాయకులు పాల్గొన్నారు.




## డాక్టర్ అబ్దుల్ కలాంకి ఘనంగా నివాళులు అర్పించిన ఏఎంఎల్ కళాశాల

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక కొత్తూరు ఏఎం కళాశాల లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కళాశాల అధ్యక్షుడు కరస్పాండెంట్ శ్రీధరాల కృష్ణ, పేర్రాజు, పెంటకోట వెంకట రామారావు కలాం విగ్రహానికి పూలమాల వేసి సి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సాగర్ మాట్లాడుతూ కలాం గారి జీవితం అందరికీ ఆదర్శం అని పేపర్ బాయ్గా జీతం ప్రారంభించి దేశంలో ఉన్నతమైన రాష్ట్రపతి పదవిని అలంకరించారని ఆయన చెప్పిన మాటలలో కలలను కనండి వాటిని సాకారం చేసుకోండి అని ఆయన పేర్కొన్నారు అదే విధంగా కోరుకొండ లింగమూర్తి గారి వర్ధంతి సందర్భంగా వారి విగ్రహాన్ని పూలమాలవేసి నివాళులర్పించి కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థులు కు అలాగే ప్రజలు ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో అనకాపల్లి వర్తక సంగం సేవా దృక్పథం తో స్థాపించడం జరిగింది వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రసూతి ఆసుపత్రి, కాలేజ్, హై స్కూల్ ఎన్నో స్థాపించి ఎంతో మంది గ్రామీణ విద్యార్థులకు గ్రామీణ ప్రజలకు ఈనాటి వరకు సేవలు అందిస్తున్నారు ఆయన గుర్తుగా వర్తక సంఘం లింగమూర్తి కళాశాల నామకరణం చేశారని సోమవారం కళాశాల వ్యవస్థాపక దినంగా జరుపుకొని నివాళులు అర్పించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి శివ, వాసిరెడ్డి బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, సూపర్డెంట్ అనురాధ అధ్యాపకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తిలో ముమ్మరంగా 'మీ ఇంటికి మీ సుధీర్ అన్న' కార్యక్రమం

**శ్రీకాళహస్తి,జులై 27,జయ జయహే:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నియోజకవర్గంలో 'మీ ఇంటికి మీ సుధీర్ అన్న' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, వార్డు ఇన్చార్జ్ నాగమల్లి దుర్గాప్రసాద్, క్లస్టర్ ఇన్చార్జ్ గాదిపక్కల గోపీనాథ్, యూనిట్ ఇన్చార్జ్ వినయ్ కుమార్, వజ్రం కిషోర్ బాబులతో పాటు బూత్ ఇన్చార్జ్‌లు సాజిద్, ప్రతాప్ రెడ్డి, బాలాజీ, హరి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## కరణిమిట్టలో ముమ్మరంగా ఈ-క్రాప్ నమోదు

**బుచ్చినాయుడు కండ్రిగ,జులై 27, జయ జయహే:**

బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలోని కరణిమిట్ట గ్రామంలో ఈ-క్రాప్ (ఈ-పంట) నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. వ్యవసాయ శాఖ అధికారిణి చంద్రమ్మ నేరుగా వరి పొలాల్లోకి వెళ్లి, మొబైల్ యాప్ ద్వారా జియో-ట్యాగింగ్ చేస్తూ సాగు వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నారు. ఈ నమోదు ఆధారంగానే రైతులకు సున్నా వడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వేళ ఇన్పుట్ సబ్సిడీ వంటి ప్రభుత్వ పథకాల లబ్ధి అందుతుందని ఆమె తెలిపారు. పంట వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అయ్యాక, రైతులు తమ రైతు సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు సురేంద్ర రెడ్డి, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.





## కాణిపాక వినాయక స్వామిని దర్శించుకున్న సినీ నటుడు సుమన్

**పూతలపట్టు,జూలై 27,జయ జయహే:**

కాణిపాక శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామివారిని సోమవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర టెలివిజన్ రంగస్థల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, సినీ నటుడు తల్వార్ సుమన్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మూషిక మండపంలో వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మిత్రుడు, చిత్తూరు జిల్లా ఈడిగ సంఘం అధ్యక్షుడు నాగరాజ్, కాణిపాకం ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



## కాణిపాక కళ్యాణ వేదికలో కళాకారుల వీణ నాదం

**పూతలపట్టు,జూలై 27,జయ జయహే:**

శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయ కళ్యాణ వేదిక నందు సోమవారం కళా నివేదనలో భాగంగా సంకీర్తన సేవ బృందం ఆధ్వర్యంలో వీణనాద కార్యక్రమం వైభవంగా జరిగింది. విజయవాడకు చెందిన సుమారు 150 మంది వీణ కళాకారులు ఈ ఆధ్యాత్మిక స్వరార్చనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, ఈవో పెంచల కిషోర్ వీక్షించి, కళాకారుల బృందానికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, కళా బృందం సభ్యులు ఉమాదేవి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



## జగన్నాథ స్వామి పది రోజుల ఉత్సవాలకు వచ్చిన ఆదాయం 18,44,366 రూపాయలు

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి గవరపాలెం అగ్గీ మర్రిచెట్టు వద్ద కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి రథయాత్ర తీర్థ మహోత్సవాలు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆలయ మండపంలో దేవాదాయ శాఖ సిబ్బంది భక్తులు స్వామివారి హుండీ నగదు లెక్కించడం జరిగింది దర్శనం టికెట్ లు, హుండీ మొక్కుబడులు ద్వారా 18,44,366 రూపాయలు ఆదాయం వచ్చినట్టుగా ఆలయ అధికారులు తెలియజేశారు గత ఏడాది కంటే ఈ ఏడాది మూడు లక్షల ఏడు వేల తొమ్మిది వందల తొంబై తొమ్మిది రూపాయలు ఎక్కువగా వచ్చిందని ఆలయ ఈవో మరియు ఆలయ చైర్మన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ దాడి బుజ్జి,కార్యనిర్వాహన అధికారి కే చంద్ర తేజ, బి మురళి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




## సౌత్ జోన్ చెస్ ఛాంపియన్కు టెక్కలి విద్యార్థులు

**టెక్కలి జూలై 27 జయ జయహే**

ప్రపంచంలో ప్రతిభకు ఎక్కడైనా చోటు లభిస్తుందని విద్యార్థులు నిరూపించారు, సౌత్ జోన్ చెస్ ఛాంపియన్షిప్ పోటీలకు సౌత్ ఇండియా నుంచి 2 వేలమంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకునే అవకాశం ఉందని చెస్ ఇన్ స్కూల్ ట్రైనర్ సనపల భీమారావు తెలిపారు. హైదరాబాదులో జరుగుతున్న చెస్ టోర్నమెంట్కు శ్రీకాకుళం జిల్లా టెక్కలి అల్ఫాజన్ పాఠశాల విద్యార్థులు సౌన గల భార్గవ్, బ గాది దినకర్ తేజ, బోయిన సూర్య జతిన్ , బి జయదేవ్ పాల్గొంటున్నారు. చెస్ పోటీలకు కోచ్ గా ఆల్ ఇండియా చెస్ ఇన్ స్కూల్ ట్రైనర్ గా సనపల భీమారావు ,మేనేజర్ గా సాగర్ వ్యవహరించనున్నారు. సౌత్ ఇండియా చెస్ చాంపియన్షిప్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, చదువులతో పాటు క్రీడల్లో జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆశాభావాన్ని పాఠశాల డైరెక్టర్లు కోట మురళీధర్, వర్మ, సునీల్, ప్రిన్సిపల్ డాక్టర్ జనీత్ పాల్ పేర్కొన్నారు.

# భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం వాయిదా వేయాలి

**కోవిడ్ విజృభిస్తున్న వేళ భారీగా ప్రారంభం అవసరమా**

**ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి నివాసంలో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ భేటీ**

**రాజమండ్రి, జూలై 27, జయ జయహే**

ఎయిర్ పోర్టు ప్రారంభం వాయిదా వేయాలి తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ఆగస్టు 1వ తేదీన ప్రారంభించనున్న భోగాపురం ఎయిర్ పోర్టు కార్యక్రమాన్ని తెలుగు శక్తి పూర్తిగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. సోమవారం ఉదయం రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసంలో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ భేటీ అయ్యారు. అనంతరం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామ్



మాట్లాడుతూ దీనిపై ఇప్పటికే దేశ ప్రధాని నరేంద్ర మోడీకి, రాష్ట్రపతికి లేఖలు సమర్పించామన్నారు. హిందూ ధర్మం ప్రకారం ఆషాడమాసంలో ఎటువంటి శుభకార్యాలు చేయనప్పటికీ ఇలాంటి దేశానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం సరికాదని, హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ఈ మహోన్నత కార్యక్రమానికి ప్రధానితోపాటు గవర్నర్, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ఉన్న మంత్రులు తదితరులు వస్తున్న నేపథ్యంలో ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పేరు లేదని, ప్రతిపక్షాల పేరు లేదని, ఎవరు పేరు లేకుండా ఒక్క నారా లోకేష్ పేరు ఉండడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. కోవిడ్ ఇప్పుడు విజ్రంభిస్తున్న నేపథ్యంలో రెండు లక్షల మందితో కార్యక్రమాన్ని తలపెట్టడం సరికాదని, దీనిపై ఏమైన అనారోగ్య సమస్యలు తలెత్తితో ఎవరు బాధ్యత వహిస్తారని డిమాండ్ చేశారు.

# వైసీపీ రాజ్యంలో కళింగ వైశ్యులకే ప్రాధాన్యత

**వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షులు కేకే రాజు**

**విశాఖపట్నం, జూలై 27, జయ జయహే :**

వైశ్యులకు ఏ కష్టం వచ్చిన మీతో నేనుంటాని, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షులు కె.కె రాజు భరోసా ఇచ్చారు. విశాఖపట్నం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కళింగ వైశ్య అధ్యక్షులు తాళాసు సాయిమోహన్ ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం జిల్లాలో ఉన్న వివిధ విభాగాల వైసీపీ కళింగ వైశ్య నాయకులు, వైసీపీ పార్టీ కళింగ వైశ్య కుటుంబ సభ్యులందరూ విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుల కె.కె రాజుని.. మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ సమాజంలో వైశ్యులుకు ప్రత్యేక గౌరవం, స్థానం ఉందని వైశ్యులకు ప్రజలతో ఎక్కువ సంబంధాలు వ్యాపార రూపంలో ఉంటాయని, ఏదైన శుభ కార్యక్రమాలకు వెళ్తే వైశ్యుడు ఎదురైతే మంచి జరుగుతుందని, వ్యాపారంలో మొదటి బోణీ చెయ్యాలి అంటే వైశ్యులే శ్రేష్ఠమైన వారని వైశ్యుల గొప్పతనాన్ని చెప్పారు. ఇదే



సందర్భంలో అక్కడికి వచ్చిన వైశ్య కుటుంబ సభ్యులందరికి వ్యక్తిగతంగా పేరు పేరున పరిచయం చేసుకొన్నారు. వై.య-స్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కళింగ వైశ్య విభాగ రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా కళింగ వైశ్య విభాగం అధ్యక్షులు తాళాసు సాయిమోహన్ ఆధ్వర్యంలో కళింగ వైశ్యులు ఇంత పెద్ద స్థాయిలో హాజరవ్వడం అభినందనీయమని, పార్టీ బలోపేతానికి అందరం కష్టపడి పనిచేద్దామని 2029 లో జగన్ని ముఖ్యమంత్రిని చేసే విషయంలో కళింగ వైశ్యుల పాత్ర ప్రధానమైనదిగా




పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కళింగ వైశ్యుల కుటుంబాలకు పార్టీ నమ్ముకున్న నాయకులకు ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేసారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు,పేడాడ రమణికుమారి, శ్రీకాకుళం జిల్లా కళింగ వైశ్య అధ్యక్షులు తంగుడు జోగారావు, తంగుడు నాగేశ్వరావు, ఉన్న నాగరాజు, వైశ్యరాజు కేశవరావు గుడ్ల దామోదర్ విశాఖపట్నం జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు సకలాభక్తు ప్రసాదరావు, పొట్నూరు మధు తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు మృతి

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి మండలం మూలపేట గ్రామంలో నుంచి ఇసుక తరలిస్తూ ఉండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది దీనికి సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి. మూలపేట గ్రామము నుంచి ఇసుక తరలిస్తూ సంపత్ పురం గ్రామం వద్ద ఇసుక ట్రాక్టర్ స్పీడ్ గా వస్తూ అదుపుతప్పి బోల్తాపడటంతో ఆ ట్రాక్టర్లులో ఉన్న ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చందడం జరిగింది. కూలీలు ఒకరు కండి ముసలి నాయుడు 60 ఏళ్ళు మరో మహిళ మందారపు మంగ 40 కూలి పని చేస్తూ జీవనం చేస్తున్నారు ఈ ప్రమాదంలో వీరు మృతి చెందడంతో వారి గ్రామాల్లో విషాదం చోటుచేసుకుంది ఇసుక ట్రాక్టర్ బోల్తా పడిన సమయంలో ఇసుక మహిళపై మొత్తం అంతా పడిపోవడంతో ఊపు రావడానికి ఆమె చనిపోవడం జరిగింది ఈ వృద్ధుడు ప్రమాదం జరిగినప్పుడు ట్రాక్టర్ పై నుండి దూకడంతో అదుపుతప్పి ట్రాక్టర్ చక్రం కింద పడిపోవడంతో శరీరం కింద భాగం అంతా నుజ్జు కావడంతో అక్కడకి అక్కడే చనిపోవడం జరిగింది. అక్కడ స్థానికులు గుర్తించి వారిని రక్షించే ప్రయత్నం జరిగినప్పుడు అప్పటికే చనిపోవడం జరిగింది . దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారాన్ని అందించడంతో రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారిని స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రులకు మార్చురీకి తరలించడం జరిగింది . ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ ప్రాణాలతో స్వల్ప గాయాలతో బయటపడటం జరిగింది




## రెండేళ్ల కూటమి ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఇంటింటికీ టీడీపీ

**టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య**

**గుంటూరు, జూలై 27, జయ జయహే :**

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్ సూచనలతో 51వ డివిజన్ కార్పొరేటర్ ముప్పవరపు భారతి 51 డివిజన్ బొంతల సాయి ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభించారు.. ఈ కార్యక్రమాన్ని గుంటూరు తూర్పు నియోజకవర్గం 51 డివిజన్ 40వ బూతులో తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య ప్రారంభించి మాట్లాడుతూ కూటమి రెండేళ్ల ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతోందన్నారు. సూపర్-6 హామీలు, పొందిన లబ్దిని ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం పథకాలను వివరిస్తూ ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యమని లక్ష్మయ్య పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికగా 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ఎంతో దోహదపడు తుందన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాలు నిర్వహిస్తుందని తద్వారా రాష్ట్ర ప్రజలకు లబ్ది చేకూరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రాష్ట్రంలో అనేక పెట్టుబడులు తీసుకొస్తున్నారని లక్ష్మయ్య తెలియజేశారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను వైకాపా పార్టీ హేళన చేసి, కూటమి ప్రభుత్వంపై ముఖ్యంగా నారా లోకేష్ గారిపై నిందలు వేస్తున్నారని లక్ష్మయ్య విమర్శించారు. రాజధాని పై వైకాపా పార్టీ పూటకో మాట మారుస్తూ , నేడు మావిగన్ అని కొత్త పంథా మొదలెట్టారని , గత ఐదు సంవత్సరాలు ఇరిగేషన్ వ్యవస్థను భ్రష్టు పట్టించారని తీవ్రస్థాయిలో జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య ధ్వజమెత్తారు. కార్యక్రమంలో 40వ బూతు ఇన్చార్జి మాధవరావు 39వ బూతు ఇన్చార్జి కోటపాటి ప్రభాకర్ యూనిట్ ఇన్చార్జి రఫీ సోషల్ మీడియా ఇన్చార్జి వెంకట్ పార్టీ సీనియర్ నాయకుడు చామంతి బాబు 20 ఇంచార్జి గండికోట బాబు తదితరులు పాల్గొన్నారు.




## ఈనెల 28 నుండి కౌతాళంలో తి. తి. దే. ధార్మిక కార్యక్రమాలు

**కౌతాళం (జయ జయహే)**

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కౌతాళంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నందు మంగళవారం నుండి శనివారం వరకు ప్రతిరోజు సాయంత్రం 6-00 గంటల నుండి ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మూడురోజులపాటు స్వాత్మానందస్వామిచే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం ఉదయం 10-00 గంటలకు సామూహిక గోపూజ మరియు కుంకుమార్చన, శనివారం శ్రీ రామాలయం నందు భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను కౌతాళంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరావు, జి. సోమశేఖర రెడ్డి, జి. శేషారెడ్డి స్థానిక భక్తమండలితో కలిసి కరపత్రాలను బ్యానర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమంతప్ప, అయ్యప్ప, ఒడ్డె రాముడు, టి. లింగారెడ్డి, ఓంకారరెడ్డి, నర్సిరెడ్డి, రాఘవ, శ్రీనివాసుల రెడ్డి, టి. నారాయణ రెడ్డి, శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## మన కూరగాయల తోట మనమే పెంచుకుందాం

**రసాయన ఎరువులు లేని కూరగాయలు ఆరోగ్యకరం: జె వి రత్నం**

**విశాఖపట్నం( జయ జయహే)**

మన కూరగాయల తోట మనమే పెంచుకుందాం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం హెచ్ పిసిఎల్ వాల్తేర్ క్లబ్ లో హెచ్ పిసిఎల్ హెచ్ ఆర్ అసిస్టెంట్ మేనేజర్ డి. రాజేశ్వరరావు అధ్యక్షతన గ్రీన్ క్లైమేట్ టీం మన కూరగాయల తోట కార్యక్రమంలో భాగంగా దేశీయ నలుపు, తెలుపు వంగ నారు, టమాటా, పచ్చిమిర్చి, బంతి నారు మొక్కలు పంపిణీ చేసిన తర్వాత ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులు లేని కూరగాయలు ఆరోగ్యకరం అన్నారు. దీనిని దృష్టి లోనికి తీసుకొని ప్రతి ఏటా విశాఖపట్నంలో వేలాది మందికి దేశీయ కూరగాయ, ఆకుకూరల విత్తనాలు, నారు పంపిణీ చేస్తున్నామని వివరించారు. కూరగాయలు ఇంటి వద్ద పెంచుకుంటే మానసిక ఒత్తిడి తగ్గుతుంది అని పేర్కొన్నారు. అలాగే ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. అంతేకాక ఇంటిలోనే అందరికీ ప్రశాంతంగా ఉంటుందని వివరించారు. వేడెక్కుతున్న శీతోష్ణస్థితి పరిస్థితుల్లో ఇంటి పై కప్పు మీద కూరగాయలు పెంచితే వేడి తగ్గుతుంది అని తెలియజేశారు. విశాఖ నగరంలోని ప్రతి ఒక్కరూ మన కూరగాయల తోటను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ క్లబ్ లోని పలువురు మహిళలు, సిబ్బంది, హెచ్ పి సీఎల్ ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మి , గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో సమన్వయకర్త జె రాజేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు.

## చోరీలకు పాల్పడే 84 మంది అరెస్టు

**534 గ్రాముల బంగారం, 699 గ్రాముల వెండి స్వాధీనం**

**స్వాధీన సొత్తును బాధితులకు అందజేసిన సీపీ బాగ్చీ**

**విశాఖపట్నం, జూలై 27, జయ జయహే :**



గత జూన్ మాసంలో నగర పరిధిలో ఉన్న పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన 95 చోరీ కేసులకు సంబంధించి 84 మంది నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి సుమారు ఒక కోటి 8 లక్షల రూపాయల విలువైన సొత్తును రికవరీ చేశామని నగర పోలీస్ కమిష నర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. కమిషనరేట్లో సోమవారం ఏర్పాటు చేసిన 'క్రైమ్ మేళా'లో స్వాధీనం చేసుకున్న సొత్తును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో నగరంలో 95 చోరీ కేసులు నమోదైతే వాటిలో 71 కేసులను ఛేదించామన్నారు. 84 మందిని అరెస్టు చేసి వారి నుంచి 534.455 గ్రాముల బంగారం, 699.8 గ్రాముల వెండి, రూ.1,16,281 రూపాయల నగదు, 27 మోటార్ సైకిళ్లు, 5 ఆటోలు, ఒక ల్యాప్టాప్ తో పాటు 470 సెల్ఫోన్లు, 5 గ్యాస్ బండలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా కీలక ప్రాంతాల్లో 203 సీసీ కెమెరాలు, జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 204 చోట్ల అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు.




## ముగిసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ శిక్షణ

**చోడవరం జులై 27 జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ లో మూడు రోజులపాట లింక్స్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన ఉన్నాయని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ , స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రాజుకుమార్ ఏపీ ఎస్ ఎస్ సి డి సి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, శిక్షకుడు జగదీష్ పాల్గొన్నారు.

## పాడేరు డీఈవో కార్యాలయ నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇబ్బందులు

**తల్లికి వందనం' పథకానికి దూరమయ్యే ప్రమాదం**

**ఆదివాసి జేపీసీ ఆందోళన..**

**కొయ్యూరు :(జయ జయహే )న్యూస్ జులై 28,**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివాసి జేపీసీ కొయ్యూరు మండల అధ్యక్షుడు ఎస్. అశోక్ లాల్ ఆరోపించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, పదో తరగతి పూర్తిచేసి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల పేర్లను పాఠశాలల నుంచి ఆన్‌లైన్‌లో తొలగించేందుకు సంబంధిత ఉపాధ్యాయులు నెల రోజుల క్రితమే పాడేరు డీఈవో కార్యాలయానికి వివరాలు పంపినప్పటికీ, ఇప్పటి వరకు వాటిపై చర్యలు తీసుకోలేదని ఉపాధ్యాయులే చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కారణంగా సచివాలయాల్లో విద్యార్థుల డేటాసెట్‌లో వారి పేర్లు కనిపించడం లేదని సచివాలయ సిబ్బంది తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారని చెప్పారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాల లబ్ధి నుంచి పేద గిరిజన విద్యార్థులు దూరమయ్యే ప్రమాదం ఉందని అశోక్ లాల్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ సమస్యను పాడేరు డీఈవో కార్యాలయ అధికారులు అత్యవసరంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అశోక్ లాల్,విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.




## భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి కలాం

**పెదకూరపాడు,జూలై 27( జయ జయహే)**

శాస్త్రవేత్తగా,బోధకుడిగా, రాష్ట్రపతిగా భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప మహానీయుడు డాక్టర్ అబ్దుల్ కలాం అని జన చైతన్య సమితి నిర్వాహకులు షేక్ లియాకత్ అలీ అన్నారు. పెదకూరపాడులోని జన చైతన్య సమితి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సోమవారం భారతదేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లియాకత్ అలీ మాట్లాడుతూ భారత రక్షణ రంగా బలోపేతానికి ఎనలేని కృషి చేసిన అబ్దుల్ కలాం తుది శ్వాస వరకు భరతమాత సేవలో తరించి యువత భవిత కోసం తపించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. కోట్లాదిమంది యువతకు కలలు కనమని స్ఫూర్తినిచ్చిన మహోన్నత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య సమితి ప్రతినిధులు షేక్ సుభాని,కె వెంకటేష్,రవి, మహేష్ తదితరులున్నారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com